ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
7
ఆదివారం 30 మార్చి 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 24.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25
(ఆది)



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, చిత్రంలో ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు తదితరులు

ఢిల్లీ పెద్దలను వణికించిన ఎన్టీఆర్

- మంత్రి కొలుసు పార్థసారథి..
- నూజివీడులో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాతో కలసి ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

నూజివీడు టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగువారి ఆత్మగౌరవం నినాదంతో టీడీపీని స్థాపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకవర్గాలు చేపట్టి ఢిల్లీ పెద్దలను సైతం వణికించిన నాయకుడు నందమూరి తారక రామారావు అని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు ఆర్ఆర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహాన్ని శనివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఏఎంసీ ప్రాంగణంలో జరిగిన సభలో కొలుసు మాట్లాడుతూ పార్టీని స్థాపించిన అనతికాలంలోనే రాష్ట్రంలో అధికారం చేపట్టి సంక్షేమ పథకాల అమలును ఎలా చేయాలో చేసి చూపారన్నారు. అదేబాటలో చంద్రబాబు తన మార్క్ రాజకీయాన్ని చూపుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పయనించేలా చేశారన్నారు పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో టీడీపీ కార్యకర్తల త్యాగాలను మరువలేమన్నారు. పల్లా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ అవినీతి పునాదులపై పుట్టిన పార్టీలు కాలగర్భంలో కలిసిపోక తప్పదన్నారు. టీడీపీ ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రజా సంక్షేమం కోసం పోరాటం చేసి తిరిగి నిలబడిందన్నారు. ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఏలూరు, చింతలపూడి ఎమ్మెల్యేలు బడేటి చంటి, రోషన్‌కుమార్ అన్ని మండలాల టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉగాది సందర్భంగా శనివారం ఏలూరు వన్‌టౌన్ మార్కెట్‌లో వేపపువ్వు కొంటున్న మహిళ



• విశ్వావసుకు స్వాగతం

జీవితం కష్టసుఖాల సమ్మేళనం. అన్ని సమపాళ్లల్లో స్వీకరిస్తేనే మాధుర్యం. ఇదే.. ఆరు రుచుల ఉగాది పచ్చడి వెనుక పరమార్థం. అందరి జీవితాల్లో 'విశ్వావసు' నామ సంవత్సరం.. శుభాలను తీసుకురావాలని ఆకాంక్షిస్తూ.. తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం.

ఐశ్వర్యాభివృద్ధిరస్తు

- విశ్వావసు నామ సంవత్సరంలో అంతా శుభమే - ఆర్థికంగా మరింత ప్రగతి
- ప్రతి ఒక్కరి జీవితాలు మెరుగుపడతాయంటున్న పంచాంగకర్తలు
- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా నేడు ఉగాది ఉత్సవాలు
- ముస్తాబైన ఆలయాలు - పంచాంగ శ్రవణానికి సర్వం సన్నద్ధం

■ లోపలి పేజీలో..

కళకు పట్టం

పలువురిని వరించిన కళారత్న, ఉగాది పురస్కారాలు

■ లోపలి పేజీలో..

నేడు ఏలూరులో ఉగాది వేడుకలు

ఏలూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఏలూరు గిరిజన భవనంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. నాదస్వరం, పంచాంగ శ్రవణం, వేదాశీర్వచనం, వేద పండితుల సత్కారం, కవి సమ్మేళనంతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి శుభాకాంక్షలు తెలిపారు.

ఒకటో తేదీనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ఏలూరుసిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద ఏప్రిల్ నెల పింఛన్ చెల్లింపులు ఒకటో తేదీ ఉదయం 7గంటల నుంచి ప్రారంభమవుతుందని, ఏదైనా కారణం చేత ఆరోజు తీసుకోకుంటే ఏప్రిల్ 2న పంపిణీ చేస్తారని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లాలో ఏప్రిల్ నెలలో 2,60,195 మంది పింఛన్ దారులకు రూ.113.14 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా నూరుశాతం పంపిణీ చేయాలని సూచించారు.



ఆందోళన చేస్తున్న కైకలూరు పంచాయతీ కాంట్రాక్ట్ సిబ్బంది

ఉద్యోగ భద్రత కల్పించండి

- కైకలూరులో పంచాయతీ కాంట్రాక్ట్ సిబ్బంది ఆందోళన

కైకలూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కైకలూరు పంచాయతీలో టెండర్ వివాదం ముదరడంతో 86 మంది కాంట్రాక్ట్ సిబ్బంది శనివారం ఆందోళన బాట పట్టారు. విధులను బహిష్కరించి పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. 25 ఏళ్లుగా పంచాయతీలో పనిచేస్తున్నామని కక్షపూరితంగా సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, ఆమె భర్త ప్రసాద్ వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి తమ ఉద్యోగాలు తమకు ఇవ్వకుంటే కుటుంబంతో సహా రోడ్డుపై పడతామని, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్, కలెక్టర్ తక్షణమే తమ సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. కాగా ఆందోళన సమాచారం తెలుసుకున్న జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ అక్కడకు వచ్చి వారి ఉద్యోగాలకు ఎలాంటి ఇబ్బంది లేదని నచ్చజెప్పారు. టెండర్ ప్రక్రియ పూర్తయినా పంచాయతీ పరిపాలన ఆమోదం పొందాల్సి ఉంటుందని, పంచాయతీ పాలకవర్గ సభ్యులంతా కాంట్రాక్ట్ సిబ్బందికి అండగా ఉండడంతో మీ ఉద్యోగాలకు ఎలాంటి ముప్పు ఉండదని సూచించారు. తక్షణమే పంచాయతీ కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కార్యదర్శి ఆనంద భూషణంను ఆదేశించారు. కాంట్రాక్ట్ సిబ్బందికి నిమ్మరసం ఇచ్చి ఆందోళన విరమింపజేశారు. డీఎల్‌పీవో పూర్ణచంద్రశేఖర్, ఎండీవో ఆర్.ఫణీంద్ర, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చట్టప్రకారమే టెండర్ ప్రక్రియ..

పంచాయతీలో పంచాయతీరాజ్ చట్టప్రకారం తక్కువ ధరకు టెండర్ వేసినవారికే అవకాశం ఇస్తారని సర్పంచ్ నవరత్న కుమారి అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ తనపై పంచాయతీ కార్మికులు బురద జల్లుతున్నారని, చట్టప్రకారమే టెండర్ ప్రక్రియ నిర్వహించామన్నారు. పంచాయతీ ఆదాయంలో 30 శాతం మాత్రమే సిబ్బంది జీతాలు చెల్లించాలని 90 మందికి జీతాలు చెల్లించడం వలనే తన చెక్కు పవర్ రద్దుకు ప్రధాన కారణంగా మారిందని అందువలనే తక్కువ టెండర్‌దారులనే పరిగణనలోనికి తీసుకుంటామన్నారు.

ఈసారి వరమెవ్వరికో?



నామినేటెడ్ పదవుల భర్తీ మరింత వేగవంతం కాబోతుంది. ఇప్పటికే ఉగాదికి ముందే మార్కెట్ కమిటీ చైర్మన్ల తొలి జాబితా విడుదలైంది. సమాంతరంగా దేవాలయ కమిటీలు, సహకార సంఘాల త్రిసభ్య కమిటీలు, కీలకమైన మరికొన్ని కార్పొరేషన్ల పోస్టులను భర్తీ చేయబోతున్నారు. జిల్లాలో ఆరు వేల మందికిపైగా తమకు మంచి అవకాశం ఇవ్వాల్సిందిగా తెలుగుదేశం అధిష్ఠానంకు దరఖాస్తు చేసుకున్నారు. అటు జనసేన, ఇటు బీజేపీలకు చోటు ఇవ్వడం ఖాయంగా తేలింది. అయితే పార్టీ తమకు అవకాశం ఇస్తుందా, లేదా అనే సందేహంలోనే కేడర్, సీనియర్ నాయకులు తీవ్ర ఉత్కంఠలో పడ్డారు.

- నియోజకవర్గాల నేతల్లో తీవ్ర ఉత్కంఠ
- మార్కెట్ కమిటీల్లో ఆచితూచి వ్యవహరించారన్న భావన
- మిగతా వాటి భర్తీలోను ఇదే జరగాలన్నదే అందరి ఆశ
- మరోవైపు కార్పొరేషన్ల పదవుల్లోను చోటు ఇవ్వాలన్న కోరిక
- సామాజికవర్గం కాదు.. పనితనాన్ని బట్టి ఇవ్వాలంటున్న మహిళా నేతలు
- బీజేపీ, జనసేన తమకూ ఇవ్వాలని డిమాండ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావొస్తోంది. ఒక దఫా నామినేటెడ్ పోస్టులు కొన్నింటిని మాత్రమే ప్రకటించారు. తాజాగా మార్కెట్ కమిటీ చైర్మన్లను ప్రకటించగా, మిగతా కమిటీ సభ్యులతో కూడిన జీవోలు ఒకటి, రెండు రోజుల్లోనే విడుదల కానున్నాయి. నియోజక వర్గాల్లో స్థానికంగా కీలకమైన పదవి మార్కెట్ కమిటీ చైర్మన్. దీనికోసం తీవ్ర స్థాయిలోనే స్థానిక నేతలంతా పోటీలు పడ్డారు. ఎమ్మెల్యేలు ఆయా మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులకు ఉన్న రిజర్వేషన్‌ను దృష్టిలో పెట్టుకుని మూడు పేర్లను పార్టీ అధిష్ఠానానికి పంపారు. కొన్నిచోట్ల ఒక పేరునే సిఫార్సు చేశారు. ఎమ్మెల్యేల నుంచి అందిన జాబితాలన్నింటిపైనా అక్కడక్కడ అభిప్రాయ సేకరణ జరిపారు. దెందులూరు మార్కెట్ కమిటీ నుంచి మహిళా రిజర్వేషన్ పేరిట సీనియర్ నేత గారపాటి రామసీతకు అవకాశం ఇచ్చారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సైతం ఆది నుంచి ఆమె అభ్యర్థిత్వం పట్లే మొగ్గు చూపుతూ వచ్చారు. ఫలితంగా గతంలో పెదపాడు జడ్పీటీసీగా వ్యవహరించిన ఆమె తాజాగా మార్కెట్ కమిటీ చైర్మన్ హోదాను పొందగలిగారు. ఏలూరులో మామిళ్ళపల్లి పార్థసారథికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కింది. సారథితోపాటు మిగతా నేతలు కంప్యూటర్ ప్రసాద్, పూజారి నిరంజన్ పేర్లు ప్రముఖంగా వినిపించాయి. కాని చివరకు సారథి వైపే అధిష్ఠానం మొగ్గు చూపింది. మార్కెట్ కమిటీ సభ్యులుగా మరికొందరికి అవకాశం ఇవ్వబోతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన పక్షాన ఉంగుటూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కె.జ్యోతిని ఎంపిక చేశారు. చింతలపూడి మార్కెట్ కమిటీ కోసం టీడీపీ పక్షాన పెద్ద ఎత్తున అభ్యర్థులు రంగంలో ఉన్నారు. గత మూడు నెలలుగా వీరంతా పార్టీ ముఖ్యులతో టచ్‌లో ఉన్నారు. తొలి జాబితాలో చింతలపూడి మార్కెట్ కమిటీ చైర్మన్ పేరు ప్రకటిస్తారనుకున్నా అది సాధ్యంకాలేదు. నందిగం బాబి, కిలారు సత్యనారాయణ, గుత్తా వరప్రసాద్, రాధారాణి, మధుబాబు వంటి వారి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరితోపాటు జనసేన కూడా మార్కెట్ కమిటీ తమకే రావాలని గట్టిగా డిమాండ్ చేస్తోంది.

ఎవరికి ఇస్తారో.. ఎప్పుడు ఇస్తారు ?

మార్కెట్ కమిటీల పదవులకు నామినేటెడ్ ఆరంభమైంది. దీంతోపాటు మిగతా పదవుల కోసం అత్యధికులు ఎదురు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మార్కెట్ కమిటీలు ఉండగా తొలి జాబితాలో మూడు మాత్రమే ప్రకటించారు. ఉంగుటూరు, కైకలూరు వంటి నియోజకవర్గాల్లో రెండేసి చొప్పున మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఉంగుటూరులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తమ వారి కోసం గట్టిగా నిలబడుతున్నారు. ఇప్పుడు ఎలాగూ ఉంగుటూరును భర్తీ చేసినందున ఇదే నియోజకవర్గంలో ఉన్న భీమడోలు తమకే దక్కుతుందన్న భావనలో టీడీపీ ఉంది. కైకలూరు, కలిదిండి మార్కెట్ కమిటీలు ప్రస్తుతానికి పెండింగ్‌లో ఉంచారు. మంత్రి కొలుసు పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడులో మార్కెట్ కమిటీని రెండో విడతలో విడుదల చేసే అవకాశాలున్నాయి.

ఇప్పటికే సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీల కోసం నియోజకవర్గాల వారీగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు జాబితాలను రూపొందించి ప్రభుత్వం వద్దకు చేర్చారు. కొన్ని సహకార సంఘాల త్రిసభ్య కమిటీల్లోను తమకు చోటు ఇవ్వాలని బీజేపీ, జనసేన పట్టుపడుతున్నాయి. పోలవరం ప్రాంతంలో జనసేనతోపాటు బీజేపీ అనుకూలురు త్రిసభ్య కమిటీల్లో చోటు కోసం గట్టిగానే ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికే కొందరు ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపన చౌదరి మద్దతు కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దాదాపు పదికి పైగా సొసైటీ కమిటీల్లో బీజేపీకి అవకాశం దక్కవచ్చు. జనసేనకు మరో 10 నుంచి 15 కమిటీల్లోను చోటు దక్కవచ్చని అంచనా వేస్తున్నారు. ఆ మేరకు జనసేన నేతలు తమ పార్టీ పక్షాన ఎమ్మెల్యేలకు సిఫార్సులు అందజేశారు. మరోవైపు వివిధ కార్పొరేషన్ల భర్తీ ఇంకా జరగాల్సి ఉన్నందున వాటిలోనైనా చోటు ఇవ్వాలని పట్టుపడుతున్న వారి సంఖ్య భారీగానే పెరుగుతోంది. తెలుగుదేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్న దాసరి శ్యాంచంద్ర శేషు నామినేటెడ్ పోస్టు కోసం పట్టుపడుతున్నారు. గత ఐదేళ్లల్లో పార్టీ వ్యవహారాల్లోను వైసీపీకి వ్యతిరేకంగా గట్టిగా నిలబడిన వారిలో ఆయనొకరు. బీసీ వర్గాలకు చెందిన తనకు సరైన స్థానం కల్పిస్తే పార్టీలో ఉన్న మిగతా వారికి సానుకూల సంకేతాలు అందుతాయన్న కోణంలోనే తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మహిళా నేతలు గంగిరెడ్ల మేఘలాదేవి, కడియాల విజయలక్ష్మి వంటి వారంతా తమకు సరైన ప్రాతినిధ్యం కల్పించాలని కోరుకుంటున్నారు. కేవలం ఒక సామాజిక వర్గ కోణంలో చూడకుండా పార్టీ కోసం ఎంతమేర పని చేశామో విశ్లేషించి తమకు అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దలకు విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు వారి పేర్లను పరిగణనలోకి తీసుకోవాలన్న కోణంలోనే ఇప్పటికే కేడర్ పట్టుదలతో ఉంది. మార్కెట్ కమిటీలు దక్కని సీనియర్లకు వివిధ కార్పొరేషన్లలోనైనా చోటు ఇవ్వాల్సిం దేనని పట్టుపడుతున్నారు.

ఇక కొత్తగా ఇంటర్ విద్య!

- ఒకటో తేదీ నుంచే ద్వితీయ సంవత్సరం తరగతులు
- 4 నుంచి 'ప్రథమ' విద్యార్థులకు బ్రిడ్జి క్లాసులు
- ప్రభుత్వ విద్యార్థులందరికీ ఎంట్రన్స్ పరీక్షల మెటీరియల్
- అడ్మిషన్లకోసం టెన్త్ విద్యార్థుల వద్దకే అధ్యాపకులు

ఏలూరు అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యలో భారీ సంస్కరణలను నూతన విద్యాసంవత్సరం (2025-26)నుంచే ప్రారంభించడానికి జిల్లాలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ బోధించేందుకు వీలుగా మార్పులు జరగనున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి నేరుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరేందుకు కొద్దిరోజులుగా జూనియర్ లెక్చరర్లు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న బాలబాలికలను, వారి తల్లిదండ్రులను కలుసుకుని నచ్చచెబుతుండగా, కొద్దిరోజుల్లోనే ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యలో అమలుకానున్న పలు సంస్కరణలపై ఓ పరిశీలన.

- ఈ ఏడాది నుంచి ఇంటర్ తరగతుల షెడ్యూలు మారింది. ఆ ప్రకారం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులను ప్రారంభించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ప్రైవేటు/కార్పొరేట్ కళాశాలలతో పోటీపడేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 23 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం తరగతులను నిర్వహించి, 24నుంచి జూన్ ఒకటో తేదీ వరకు వేసవి సెలవులు ఇచ్చేలా షెడ్యూలును సవరించింది. సెలవుల అనంతరం జూన్ 2నుంచి కళాశాలలు పునఃప్రారంభమవుతాయి. జిల్లాలో 19 ప్రభుత్వ, 31 హైస్కూల్ ప్లస్, 6 సోషల్‌వెల్ఫేర్, 3 కేజీబీవీలు, 3 ట్రైబల్‌వెల్ఫేర్, 90 ప్రైవేటు అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది ప్రథమసంవత్సరం ఇంటర్ నుంచి ద్వితీయ సంవత్సరంలోకి ప్రవేశించనున్న బాలబాలికలు మొత్తం 18,500 మంది ఉన్నారు.
- ఈ ఏడాది నుంచి ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని అన్ని కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులందరికీ ఎన్ఐటీ/ఐఐటీ, మెడిసిన్, తదితర జాతీయస్థాయి ఎంట్రన్స్ పరీక్షల మెటీరియల్‌ను ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించింది. వీటితోపాటు మొదటిసారిగా సైన్సు విద్యార్థులకు రికార్డ్ బుక్‌లు, ప్రాక్టికల్స్ మాన్యువల్స్‌ను అందజేయనున్నారు.
- ఈ ఏడాది నుంచి ప్రథమ సంవత్సరంలో ఎంబైపీసీ గ్రూపును కొత్తగా ప్రారంభించనున్నారు. ఈ గ్రూపులో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు మెడిసిన్, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలు రెండింటికీ అర్హత సాధిస్తారని అధికార వర్గాలు వివరించాయి. దీనివల్ల ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది ఫస్టియర్ ఇంటర్ అడ్మిషన్లు 4500ల నుంచి 6వేలకు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. కాగా పదో తరగతి పరీక్షల ఫలితాల వెల్లడికి మరో నెల గడువు ఉన్నప్పటికీ, విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలవైపు ఆకర్షితులయ్యేలా వారికి అదనపు తర్ఫీదునిచ్చేందుకు ఏప్రిల్ 4నుంచే ప్రథమ సంవత్సరం బ్రిడ్జి క్లాసులను నిర్వహించనున్నారు. ఫస్టియర్ పాఠ్యాంశాలు, భాషానైపుణ్యాలు, తదితర అంశాలపై బ్రిడ్జిక్లాసుల్లో విద్యార్థులకు బోధిస్తారు.



ఇంటర్ ప్రవేశాలపై టెన్త్ పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు వివరిస్తున్న ప్రభుత్వ జూనియర్ అధ్యాపకులు

ఎన్నో ప్రయోజనాలు..

ఈ ఏడాది ఇంటర్మీడియట్ విద్యలో ప్రవేశపెడుతున్న సంస్కరణల వల్ల ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకునే విద్యార్థులకు చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనంచేయడంతో ప్రస్తుతం వున్న హైస్కూల్ ప్లస్‌లలో కొన్నింటిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలుగా ఇప్పుడున్నచోటే ఏర్పాటుచేసే అవకాశం ఉంది. సంస్కరణల వల్ల ఈ ఏడాది నుంచి ప్రైవేటు కళాశాలలతో ప్రభుత్వ జూని యర్ కళాశాలల విద్యార్థులు దీటైన పోటీని వ్వడం ఖాయం.

-బి.ప్రభాకరరావు, డీవీఈవో, ఏలూరు జిల్లా

జేఈఈ పరీక్షకు అరగంట ముందే 'గేట్‌క్లోజ్'

- 2నుంచి సెషన్-2 ఆన్‌లైన్ పరీక్షలు

ఏలూరు అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఎన్ఐటీలు, ఐఐటీల్లో ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్టీయే) నిర్వహించే జేఈఈ మెయిన్స్-2025 సెషన్-2 ఆన్‌లైన్ పరీక్షలు ఏప్రిల్ 2నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో ఏలూరు సమీపంలోని వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలు కేంద్రంలో జరుగుతాయి. ఏప్రిల్ 2,3,4,7,8 తేదీల్లో ఇంజనీరింగ్, 9న బీఆర్క్, బీప్లానింగ్ విభాగాల్లో పరీక్షలు రోజుకి రెండు షిఫ్టుల్లో ఉంటాయి. ఉదయం షిఫ్ట్ పరీక్ష 9గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం షిఫ్ట్ పరీక్ష 3నుంచి సాయంత్రం 6గంటల వరకు జరుగుతుంది. ఇంజనీరింగ్ ప్రవేశపరీక్షకు షిఫ్ట్‌కు 160మంది చొప్పున, బీఆర్క్, బీప్లానింగ్ పరీక్షలకు మొత్తం 182 మందిని కేటాయించారు. పరీక్షలు ప్రారంభమయ్యే నాటికి కేటాయించిన విద్యార్థుల సంఖ్యలో స్వల్ప మార్పులు ఉండవచ్చు. ఇంతకు ముందులాగే నిర్దేశిత పరీక్ష ప్రారంభ సమయానికి అరగంటముందే పరీక్షకేంద్రం ప్రధాన ప్రవేశ ద్వారాన్ని మూసివేసే నిబంధనను ఖచ్చితంగా అమలుచేస్తామని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఆ ప్రకారం ఉదయం సెషన్ పరీక్ష విద్యార్థులు 8.30గంటల కంటే ముందుగానే, మధ్యాహ్నం సెషన్ పరీక్షార్థులు 2.30గంటల్లోగా పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించాలి. పరీక్షార్థులు తమ వెంట అడ్మిట్‌కార్డు, ఏదైనా ఫొటో ఐడీ కార్డు, రెండు పాస్‌పోర్టుసైజు ఫొటోలు (దర ఖాస్తుపై అంటించి నవి)లను తప్పనిసరిగా తెచ్చుకోవాలి. కటాఫ్ మార్కు ఆధారంగా దేశవ్యాప్తంగా 2.50 లక్షల మంది విద్యార్థులను అడ్వాన్స్‌కు క్వాలిఫై చేస్తారని నిర్వాహకులు వివరించారు.

ఈకేవైసీ గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగింపు

ఏలూరుసిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్దిదారులు ఈనెల 31వ తేదీకి ముందుగానే ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పెండింగ్ ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయడానికి ప్రభుత్వం ఏప్రిల్ 30వ తేదీ వరకు మరో నెల రోజులు గడువు పొడిగించిందని డీఎస్‌వో వై.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలు మినహా, మిగిలిన లబ్ధిదా రులు ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈకేవైసీ పెండింగ్ వివరాలతో కూడిన జాబితా ఉందన్నారు. రేషన్ డీలర్లు, వీఆర్వోల వద్ద ఈకేవైసీ చేసుకునే సదు పాయం ఉందన్నారు. ఎండీయూ ఆపరేటర్ల వద్ద ఈ సదుపాయం కల్పించాల్సిందిగా స్థానిక అధికారులు ప్రభుత్వానికి నివేదించారన్నారు. జిల్లాలో లక్షా 45 వేలు యూనిట్లు ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నాయి. ఈకేవైసీ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని జిల్లాలోని పౌరసరఫరాల శాఖ డీటీలకు ఆదేశాలు జారీ చేశామన్నారు.



పురాణాల ప్రకారం బ్రహ్మదేవుడు ఈ సమస్త చరాచర జీవరాశిని చైత్ర మాస శుక్ల పక్షపాడ్యమి నాడు సృష్టించినట్టు పురాణాలు చెబుతున్నాయి. అందుకే చైత్ర ఆరంభ దినాన్ని ఉగాది వేడుకగా జరుపుకోవడం ఆనవాయితీ. ఈ మాసంలో ప్రకృతి సప్తవర్ణ శోభితమవుతుంది. మోడు వారి తనువు చాలించిన వృక్షాలు జీవం పోసుకుని వయలు పోతుంటాయి. మూగబోయిన కోయల.. గొంతు సవరించుకుని కిలకిలరావాలను పలికిస్తుంది. ఎటు చూసినా ఆనందాల ఆహ్లాదం వెల్లివిరుస్తుంది. జీవం ఉట్టిపడేలా రాగాలను ఆలపించే కోయల గానాలు, మమతల పరిమళాలు వెదజల్లే ప్రకృతి సోయగం ప్రతి ఒక్కరి మదిని కట్టిపడేస్తుంది.



మార్కెట్‌లోకి వచ్చిన మామిడి కాయలు



ఏలూరు వన్‌టౌన్‌లో పూల బజార్‌లో మార్కెట్ రద్దీ దృశ్యం

వి శ్వా వ సు

ఐశ్వర్యాభివృద్ధిరస్తు

నూతన తెలుగు సంవత్సరంలో అంతా శుభమే - ఆర్థికంగా మరింత ప్రగతి

ప్రతి ఒక్కరి జీవితాలు మెరుగుపడతాయంటున్న పంచాంగకర్తలు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా నేడు ఉగాది ఉత్సవాలు

ముస్తాబైన ప్రముఖ ఆలయాలు - పంచాంగ శ్రవణానికి సర్వం సన్నద్ధం

ఏలూరుసిటీ,(ఆంధ్రజ్యోతి)

విశ్వావసు నామ సంవత్సరంలో అన్ని వర్గాలు ఆర్థికంగా సంతోషకరమైన జీవనం సాగిస్తారని పురాణాలు చెబుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి వ్యాప్తంగా ఉగాది సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అంతేకాకుండా సంవత్సర ఫలాలను వివరిస్తూ పంచాంగ శ్రవణ కార్యక్రమాలు జరుగుతాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఉగాది వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ పండుగ రోజున తెల్లవారు జామునే అభ్యంగన స్నానమాచరించి నూతన వస్త్రాలు ధరించి తొలి పూజ చేసుకుని షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని ఆరగిస్తారు.

విశ్వావసు నామ సంవత్సర ఫలితాలు ఇలా..

విశ్వావసు నామసంవత్సరంలో పంచాంగ రీత్యా ఈ సంవత్సరానికి రాజు సూర్యుడు, మంత్రి చంద్రుడు, సేనాధిపతి, మేఘాధిపతి, అర్ఘాధిపతి కూడా సూర్యుడే. జ్యేష్ఠ బహుళ దశమీ ప్రాంతంలో అంటే జూన్ 20వ తేదీ నుంచి తొలకరి వర్షాలు కురుస్తాయని, ఎరుపు, ముదురు గోధుమ వర్ణపు రంగు ధాన్యాలు పండుతాయని పంచాంగ కర్తలు చెబుతున్నారు. ఈ సంవత్సర ఆంభంలోనే చైత్ర, వైశాఖ మాసాలు(ఏప్రిల్, మే నెలల్లో) శుభకార్యాలు ఎక్కువగా ఉంటాయని, ఈ సంవత్సరంలో మొదటి 15 రోజులు సాధారణ పౌర జీవన స్థితి ఉన్నా ఆ తరువాత అన్నీ సర్దుకుంటాయని చెబుతున్నారు. అరాచక శక్తులను ప్రభుత్వం అత్యంత కట్టుదిట్టంగా అణచివేస్తుందని, న్యాయ రక్షణ వ్యవస్థలు చురుగ్గా పనిచేసి నిష్పాక్షిక నిర్ణయాలు తీసుకుంటాయని, అధికార వర్గాల్లో స్వల్ప అనిశ్చితి ఉన్నా స్వల్పవ్యవధిలో కుదుటపడుతుందని, ఆర్థికంగా అభివృద్ధి మెరుగుపడుతుందని పంచాంగ కర్తలు చెబుతున్నారు.



సమృద్ధిగా సంపద..

పాలకొల్లు,(ఆంధ్రజ్యోతి) : ఈ నూతన సంవత్సరంలో సూర్యుడు రాజుగా ఉండి పరిపాలిస్తాడని పంచాంగం ద్వారా తెలుస్తుంది. మనిషి పకృతికి, కాలానికి అనుగుణంగా జీవిస్తున్నాడు కాబట్టి పకృతి మారినప్పుడు మనిషి జీవన విధానం నూతనంగా ప్రారంభమవుతుంది. ఈ మేరకు పంచాంగకర్త సోమంచి శ్రీనివాస శాస్త్రి మాట్లాడుతూ శ్రీవిశ్వావశు నామ సంవత్సరం విశ్వానికి సంబంధించినది కావడంతో ఆర్థిక, కుటుంబ వ్యవస్థలు బలోపేతం అవుతాయన్నారు.

సంపద సమృద్ధి : ఉగాది పండగ రేవతి నక్షిత్రంతో ప్రారంభం కానుండటంతో ప్రజలు సౌమ్యంగా ఉండటమే కాకుండా సంపద సమృద్ధిగా ఉంటుందని పండితులు చెబుతున్నారు.

ఆనందం శాంతి : సంపద సమృద్ధిగా ఉండటం వల్ల ప్రజలు ఆనందంగా శాంతిగా జీవిస్తారు. కష్ట నష్టాల నుంచి బయట పడతారు. సిరి సంపదలతో సుఖమయ జీవితం గడుపుతారు.

కొత్త వ్యాధి : విశ్వావశు నామ సంవత్సరంలో ఒక కొత్త వ్యాధి ప్రబలి ప్రజలను భయపెడుతుంది. అయితే ఔషధ వాడకాలతో వ్యాధులను నియంత్రించవచ్చు.

చోరీలు పెచ్చుమీరుతాయి : తగినంత ఆదాయంతో అధిక శాతం ప్రజలు విశ్వాసు సంవత్సరంలో శాంతి జీవనం గడుపుతున్నప్పటికీ చోరీలు పెచ్చుమీరుతాయి.

పంటకు గడ్డుకాలం : ఈ ఏడాది మొక్కల పెరుగుదల క్షీణించి పంట దిగుబడులు తగ్గుతాయి. అయితే పండిన పంటకు అధిక ధరలు లభించడం ద్వారా రైతుకు ఇబ్బంది ఉండదు.

డబ్బే డబ్బు : విశ్వావశు నామంలో విశ్వానికి మంచి జరుగుతుందనే అర్థంలోనే అంతా తెలుస్తున్నప్పటికీ పౌరులు చేతిలో డబ్బుకు లోటు ఉండదు. చేతిలో సొమ్ములు లేవనే రోజు ఉండదు.

సమృద్ధిగా వర్షాలు : ఈ సంవత్సరంలో తగినంతగా వర్షాలు పడతాయి. కరువు ఏర్పడదు. అతివృష్టి అనావృష్టి పరిస్థితులు ఉండవు.

దురాశ అధికమే : విశ్వానికి మంచి జరుగుతున్నా మరో వైపు పలువురు ప్రజాప్రతినిధులు కొంతమంది అధికారులు దురాశతో నిండి ఉంటారని ఈ కారణంగా ప్రభుత్వాల పటిష్ఠతకు కొంత మేర భంగం వాటిల్లుతుంది.

ఇంద్రియ నియంత్రణ : పౌరులు మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం అధ్యాత్మికత కలిగి ఉండటం ద్వారా విశ్వావశు నామ సంవత్సర ప్రశాంతమైన వాతావరణలో దిగ్విజయంగా ముందుకెళ్తుంది.

దేశానికి సుభప్రదం : దేశానికి సుభప్రదం. రాష్ట్రంలో ప్రభుత్వం అనుకున్న పనులన్నీ నెరవేరతాయి. చంద్రగతిని అనుచరించి మార్చి 31నుంచి ప్రారంభమయ్యే విశ్వావశు నామ సంవత్సరం భవ కారణంలో మొదలవుతున్నందున ముహూర్తం నిర్ణయించి పనులు చేయాలి.

చినవెంకన్న క్షేత్రంలో ఉగాదికి ప్రత్యేక స్థానం

ద్వారకాతిరుమల : చినవెంకన్న క్షేత్రంలో ఉగాది పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. ఉగాది ఉత్సవాలను ఇక్కడ సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. శ్రీవారి వైభవాన్ని చాటేలా ఉగాది మండపంలో ఏటా కన్నుల పండువగా వేడుకను జరుపుతారు. నూతన సంవత్సరాదిలో ఆలయంలో జరిగే తొలి ఉత్సవం. ఈ శ్రీవిశ్వావసు నామ సంవత్సర నూతన తెలుగు వత్సరాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. గరుడాళ్వార్ విగ్రహ సమీపంలోని ఉగాది మండపాన్ని ఇప్పటికే రంగులతో తీర్చిదిద్దారు. అలాగే విద్యుత్ దీపతోరణాలు కటౌట్లతో పరిసరాలను అలంకరించారు. వెండి శేషవాహనంపై ఉభయ దేవేరులతో కొలువుతీరిన శ్రీవారు అట్టహాసంగా ఉగాది మండపం వద్దకు వచ్చి అక్కడి ప్రత్యేక వేదికపై కొలువుతీరుతారు. దేవతామూర్తుల ముంగిట అర్చకులు, పండితులు పంచాంగ శ్రవణాన్ని చేసి రాశిఫలాలను చదివి వినిపిస్తారు.



ఆలయ ఆవరణలో ఉన్న ఉగాది మండపం

తైలాభ్యంగానికి ప్రత్యామ్నాయంగా ప్రోక్షణ..

పంచకృత్య నిర్వహణలో మొదటిదైన తైలాభ్యంగానికి ప్రత్యామ్నాయంగా ఉగాది నాడు ఆలయ అర్చకులు ప్రోక్షణను నిర్వహిస్తారు. శ్రీవారి క్షేత్రంలో స్వామికి అభిషేకాలు, అభ్యంగనలు నిషిద్ధం. అందుకే తైలాభ్యంగానికి ప్రత్యామ్నాయంగా ప్రోక్షణ జరపడం సంప్రదాయంగా వస్తోంది. పంచకృత్య నిర్వహణలో భాగంగా నూతన సంవత్సర స్తోత్రం, నింబకుసుమ భక్షణం (ఉగాది పచ్చడి సేవనం), పూర్ణకుంభదానం, పంచాంగ శ్రవణం, జరుగుతాయి. పండిత సత్కారం, సాంస్కృతిక కార్యక్రమాలతో శ్రీవిశ్వావసు నామసంవత్సర ఉగాది ఉత్సవం పూర్తవుతుంది.

ఉగాది మండపంలో ప్రత్యేక కార్యక్రమాలు



శ్రీవారి క్షేత్రంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కరించుకుని ఆదివారం విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారమే ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే ఆలయాన్ని, ఉగాది మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాం. ఆదివారం రాత్రి ఆ మండపంలో నిర్వహించనున్న విశేష కార్యక్రమాలను వీక్షించేందుకు భక్తులు తరలిరావాలి.

ఎన్వీ సత్యనారాయణమూర్తి, శ్రీవారి దేవస్థానం ఈవో

ప్రజల పట్ల ప్రభుత్వాల్లో విశ్వసనీయత పెరుగుతుంది..



విశ్వావసు నామసంవత్సరంలో అన్నింటా శుభాలే కలుగుతాయి. ఈ సంవత్సరం ప్రజల పట్ల ప్రభుత్వం విశ్వసనీయత కలిగి ఉంటుంది. ప్రజల సంక్షేమ కోసం ప్రభుత్వం పాటుపడుతుంది. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుంది. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా ఆర్థిక మాంద్యం నుంచి బయట పడే అవకాశాలున్నాయి. ఇతర దేశాలు, రాష్ట్రాల్లో దౌత్యవ్యవహారాలు చక్కబడతాయి. ఈ సంవత్సరం అన్నిరంగాలు గతంలో కంటె మెరుగుపడతాయి. ప్రజారోగ్యం మెరుగుపడుతుంది. పాడి, పంటలు కలిసి వస్తాయి.. ఈ సంవత్సరాన ప్రజలంతా దైవ చింతన కలిగి సన్మార్గంలో పయనిస్తారు.

కాశీభొట్ల నాగవేంకట పార్వతీశ్వర శర్మ, ప్రముఖ పంచాంగ కర్త, ద్వారకాతిరుమల

ఉగాది పచ్చడిలో పరమార్థం..




ఉగాది అంటే గుర్తొచ్చేది షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడే.. ఈ విశిష్ట రుచుల సంగమాన్ని స్వీకరించడంతోనే ప్రతి ఒక్కరింటా ఉగాది ప్రారంభమవుతుంది. ఎన్ని వంటకాలు చేసినా ఉగాది పచ్చడే ఈ పండుగ స్పెషల్. తీపి, పులుపు, కారం, ఉప్పు, చేదు, వగరు అనే ఆరు రకాల రుచులతో స్వీకరించే ఈ పచ్చడి జీవిత గమనాన్ని తెలియజేస్తుంది. జీర్ణక్రియకు దోహదం చేసేందుకు బెల్లం, కప, వాతాల వల్ల వచ్చే రుగ్మతలను తొలగించేందుకు పులుపు, శరీరంలోని హానికారక క్రిములను నాశనం చేసి పంచేంద్రియాలను చురుగ్గా ఉంచేందుకు కారం, ఎన్ని కష్టాలు ఎదురైనా నూతనోత్సాహంతో ఎదుర్కొనేందుకు ఉప్పు, బాధ, దుఃఖాన్ని జయించేందుకు సంకేతంగా చేదు, జీవితంలోని కొత్త సవాళ్లకు సంకేతం, జీవిత పరమార్థం తెలియజెప్పేందుకు వగరును వినియోగిస్తారు. ఇంత పరామార్థం కలిగిన ఉగాది పచ్చడిని పండుగ రోజు ఉదయాన్నే అభ్యంగన స్నానమాచరించి స్వీకరిస్తారు.



ఉగాది సోయగం : ఉగాది అంటేనే ప్రకృతి పులకింత. చైత్ర మాసం వచ్చిందంటే ప్రకృతి సప్తవర్ణ శోభితం అవుతుంది. భీమవరంలో ఆకుల మాదిరిగా పూలతో ఓ వృక్షం కనువిందు చేసింది. రహదారి వెంట వెళ్లే ప్రతి ఒక్కరూ చూపి పులకిస్తున్నారు..

ఉదయాన్నే ఇలా చేయండి



కామవరపుకోట, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : ఉగాది రోజున ఉదయం 5 నుంచి 7.30 గంటల మధ్యలో పూజ చేసుకునేందుకు శుభప్రదం. ఆ సమయంలో వీలుకాని పక్షంలో ఉదయం 9 నుంచి 11.30 గంటల మధ్య నూతన వస్త్రాలు ధరించి ఉగాది పచ్చడి చేసుకుని తినడానికి శుభ సమయం. ఉగాది రోజున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో పసుపు, బెల్లం, చింతపండు, బంగారం, వెండి తదితర వస్తువులను కొనుగోలు చేస్తే మంచిదని పురాణాలు చెబుతున్నాయి.

రామాయణంలో ఉగాది ప్రస్తావన

శాస్త్రాల ప్రకారం ఉగా అంటే నక్షత్ర గమనం, జన్మ, ఆయుష్షు అనే అర్థాలు కూడా ఉన్నాయి. వీటికి ఆది ఉగాది. విశ్వంలోని జీవకోటి రాశుల ఆయుష్షుకు ఇది తొలిరోజు. యుగం అంటే రెండు లేదా జంట అర్థం. ఉత్తరాయాణం, దక్షిణాయాణం మధ్య సంయుతం యుగం(ఏడాది). పురాణాల ప్రకారం నారథుడి 60 మంది పిల్లలు 60 సంవత్సరాలు కాల చక్రంలో తిరుగుతుంటారని విష్ణువు వరం ఇచ్చినట్టు ఉంది. ఆ 60 మంది సంతానం పేర్లే తెలుగు సంవత్సరాలని ప్రతీతి. శ్రీవిశ్వావశు నామ సంవత్సరం 39వది. ఈ సమయంలో విశేష ధనం లభిస్తుందని నమ్మకం. ఇవి ప్రభవ, విభవ, శుక్ల ఇలా ప్రారంభమై చివరకు అక్షర సంవత్సరంతో ముగిసిపోతాయి. విశ్వావశు అంటే ఒక గంధర్వుని పేరు కూడా ఉందని, అదే విధంగా ఒక సంగీత కళాకారుడైన కదంబుడు ప్రస్తావన కూడా ఉంది. కదంబుడు అంటే రాక్షసుని పేరు. విశ్వావాసు శాపం వలన గంధర్వుడు కదంబుడిగా మారిపోయాడని, రామాయణంలో ఈ ప్రస్తావన వస్తుంది.

కుటుంబాల్లో నూతన సంతోషం



చైత్రమాసం శుక్లపక్షం పాడ్యమి తిది నాడు తెలుగు సంవత్సరాది ప్రారంభమవుతుంది. ఈ రోజునే ఉగాదిగా జరుపుకుంటాం. ఈ సారి వచ్చే ఏడాదిని విశ్వావశు నామ సంవత్సరమని అంటాం. విశ్వానికి సంబంధించినది అని అర్థం. ఈ కాలంలో ఆదాయం పుష్కలంగా లభించే అవకాశం ఉంటుంది. వ్యాపారులకు మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంది. కుటుంబ జీవితంలోను సంతోషాలు వెల్లివిరుస్తాయి. దేశాల మధ్య శత్రుత్వాలు తగ్గి స్నేహ పూర్వక వాతావరణం ఏర్పడే అవకాశాలున్నాయి. చైత్రమాసం శుక్ల పక్షం శుద్ధ పాడ్యమినాడు అంటే ఉగాది రోజున సృష్టి ప్రారంభమైనట్టు వేదాలు చెబుతున్నాయి. అందుకే సృష్టి ఆరంభానికి సంకేతంగా ఉగాది పండుగను జరుపుకుంటాం. ఉగాది నాడు వేకువ జామునే చన్నీటి స్నానం చేసి ఇంటికి మామిడాకులు అలంకరించి నూతన వస్త్రాలు ధరించి ఉగాది పచ్చడితో దిన చర్య ప్రారంభించి, పురాణాల గురించి తెలుసుకోవాలి.

సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, శ్రీలలితా శ్రీపీఠం వ్యవస్థాపకులు, వేద పండితులు, కామవరపుకోట

శుభ తరుణం - స్వాగత తోరణం



సృష్టి ఆవిర్భావమునకు శుభ తరుణం..
సకల జీవరాశి మనుగడకు స్వాగత తోరణం
సహజ సోయగాలతో ప్రకృతి ప్రదర్శనం
షష్టీ వర్ష చక్ర గమనానికి ఆహ్వానం
మూడు కాలాల సాంగత్యంతో.. రెండు ఆయనాల ఆంతర్యంతో
ఆరు రుచుల మాధుర్యంతో.. ఆరు ఋతువుల సౌందర్యంతో
మహా వైభవోపేతంగా దివ్యత్వాన్నీ ! నవ్యత్వాన్ని !!
సంతరించుకున్న తొలి పర్వదినం !
కాల స్వరూపుడి పరమ శాసనం !!
యుగానికి ఆది ఉగాదిగా బహు ప్రాచుర్యంతో
కాల చక్ర భ్రమణానికి పునాదిగా కడు చాతుర్యంతో
అద్వితీయ యశస్సులతో.. నవనవోన్మేష ఉషస్సులతో
ప్రకృతి ధర్మంతో.. సృష్టి మర్మంతో
పంచాంగ శ్రవణ ప్రాశస్త్యంతో.. ఆహ్లాదకర ఆహార్యంతో
కవుల మధుర కవనములతో.. పికముల సుమధుర గానములతో
అమోఘ అంతరార్థంతో అరుదెంచుచున్న
ఓ 'విశ్వావసు' నామ ఉగాది లక్ష్మీ..
నీకు స్వాగత సుమాంజలి..
నీవు సర్వత్రా ఒసగాలి సుఖశాంతులు.

- పొన్నపల్లి ఉమామహేశ్వరరావు, 96427 28136

విజయాల విశ్వావసు



విజయాల పునాది యుగాది
విశ్వమంతటికీ శుభాలనందించే యుగాది
పేరులోనే విశ్వాన్నంతటికీ హితాన్నందించే యుగాది
దుస్సంప్రదాయాలపై శంఖమూదే యుగాది
మంచి మార్పులకు వేదికైన యుగాది
ఆరోగ్యాన్నిచ్చే ప్రకృతి పచ్చగా వుండాలనే
శుభాది పర్యావరణాన్ని కాపాడాలనే విధిని గుర్తు చేసే యుగాది
జనహితాన్ని కోరడం మనందరి ప్రధాన విధియనే యుగాది
ఆధ్యాత్మిక జీవన రథసారథియై నడిపించే యుగాది
శాంతి సౌభాగ్యాల విజయానందాలకు పెన్నిధియైన యుగాది
షడ్రుచుల నవరసాల సారమే జీవన సారంబనే యుగాది
కష్టసుఖాల సంయోగాల ఫలమే జీవనంబనే యుగాది
ప్రజాహిత సమగ్రాభివృద్ధే ధ్యేయంగా కష్టించాలనే యుగాది
సంక్షేమాభివృద్ధిలో భాగస్వాములవ్వాలనే హితమందించే యుగాది
మన హితంకన్నా మంది హితమే నాయకుల అభిమతమవ్వాలనే యుగాది
ధర్మపాలనయే ధరణికి శ్రీ రామ రక్షయని ఎలుగెత్తి విశ్వమంతా చాటే యుగాది
సనాతన సాంప్రదాయమే మానవజాతి జీవనానికి ఆలంబనయన్న యుగాది
తెలుగు సాంప్రదాయాల రుచి మరిగిన కవికోయిలల మధురాలాపనయే యుగాది
భాషా సాంస్కృతిక పరిరక్షణ దిశగా పునరుజ్జీవనానికై దారులెత్తిన యుగాది
మనదేశం మన ప్రాంతం మన పండుగ అందరి ఆనందమే బాధ్యతనే యుగాది
స్వాగతించండి అందరూ విజయాలను మోసుకొచ్చే ఈ విశ్వావసు యుగాదిని.

- తెన్నేటి మాస్టారు, 82474 33432

టూరిజం అభివృద్ధికి కృషి చేస్తా : మంత్రి దుర్గేశ్

జంగారెడ్డిగూడెం, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లోని ప్రకృతి రమణీయతను, ప్రముఖ పుణ్యక్షేత్రాలను దృష్టిలో పెట్టుకుని రానున్న కాలంలో జంగారెడ్డి గూడెం ప్రాంతాన్ని టూరిస్టు హబ్‌గా తయారు చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. శనివారం జంగారెడ్డి గూడెంలోని ఎంబీ సోషల్ క్లబ్, కాసర నర్సిరెడ్డి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ జంగారెడ్డి గూడెం మండలం గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం, కొంగువారిగూడెంలో ఎర్రకాలువ జలాశయం, పట్టణంలోని గోకుల పారిజాతగిరి దేవస్థానం, బుట్టాయగూడెం మండలంలో గుబ్బల మంగమ్మ ఆలయాలు ఎంతో ప్రసిద్ధి చెందాయన్నారు. ఎమ్మెల్యేలతో సమావేశమై ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా ఎలా అభివృద్ధి చేయాలో చర్చిస్తామన్నారు. కళారంగానికి, క్రీడలకు, టూరిజానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల సహకారంతో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకుడు కాసర నర్సిరెడ్డి తన తాతయ్య మేడా రంగ ప్రసాద్, ఎంబీ సోషల్ క్లబ్ ఏర్పాటు చేసి కళాకారుల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, వలవల తాతాజీ, తిప్పాబొట్ల రామకృష్ణ, టీడీపీ నాయకులు పరిమి సత్తిపండు, రావూరి కృష్ణరాజాన పండు, ఎల్ఆర్. కృష్ణబాబు, అయ్యప్పరావు, పీడీ నరసింహరావు, ఎండీ మౌలా, ఆర్‌జెఎన్ఎస్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేశ్



25 ఏళ్ల తరువాత ఒక చోటుకు చేరి

మాజీ కౌన్సిలర్ల అపూర్వ కలయిక

తణుకు, మార్చి29(ఆంధ్రజ్యోతి) : తణుకు మున్సిపల్ కౌన్సిల్ మహిళా మొదటి చైర్ పర్సన్ ముళ్లపూడి రేణుకు కౌన్సిల్ సమయంలో పనిచేసిన సభ్యుల అపూర్వ కలయిక ఉత్సాహంగా జరిగింది. 25 ఏళ్ల క్రితం 2000 నుంచి 2005 వరకు పనిచేసిన కౌన్సిల్ సభ్యులంతా ముళ్లపూడి రేణుకు నివాసంలో కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు.

శక్తి యాప్‌పై విస్తృతంగా అవగాహన

భీమవరం క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : శక్తి మొబైల్ యాప్ వినియోగం, మహిళా సంబంధిత నేరాలపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మహిళా పోలీస్ ఇన్‌స్పెక్టర్ అహ్మదున్నీసా తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్కూళ్లు, కళాశాలలు, రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రముఖ షాపింగ్ మాల్స్, మూవీ థియేటర్స్ వద్ద ప్రాంతాల్లో పర్యటించి మహిళల భద్రతకై గస్తీ నిర్వహిస్తూ, శక్తి మొబైల్ యాప్ వినియోగం, గుడ్ టచ్- బ్యాడ్ టచ్ గురించి వివరిస్తున్నారు. అలాగే బాల్యవివాహాల నియంత్రణ, సైబర్ క్రైం, పోక్సో, సామాజిక మాధ్యమాల వినియోగం, అత్యవసర సేవలు- హెల్ప్‌లైన్ నెంబర్లు, ఇతర మహిళా సంబంధిత నేరాలపై విద్యార్థినులకు, మహిళలకు అవగాహన కల్పించామన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో శక్తి మొబైల్ యాప్‌తో తక్షణ సహాయం పొందవచ్చన్నారు.

శక్తి యాప్ ముఖ్య అంశాలు...

1. ఎస్ఓఎస్ బటన్ : అత్యవసర పరిస్థితుల్లో బటన్ నొక్కితే స్థానిక పోలీస్ కంట్రోల్ రూమ్‌కు లైవ్ లొకేషన్ వెళ్లి వెంటనే సాయం అందిస్తారు.
2. వీడియో, ఆడియో రికార్డింగ్ : ప్రమాదకర పరిస్థితుల్లో యాప్ ద్వారా వీడియో లేదా ఆడియో రికార్డు చేసి పోలీసులకు పంపించవచ్చు.
3. లైవ్ ట్రాకింగ్ : పోలీసులకు వాస్తవ సమయంలో మహిళల లొకేషన్ ట్రాక్ చేసి సహాయం చేసే అవకాశం కలుగుతుంది.
4. వెంటనే స్పందించే టీం : శక్తి బృందాలు అత్యవసర సమయంలో సమీప పోలీస్ స్టేషన్ నుంచి తక్షణ సహాయం అందిస్తాయి.
5. మహిళలకు ఉపయోగపడే సమాచారం : హెల్ప్‌లైన్ నంబర్లు, మహిళా సంరక్షణ చట్టాలు, భద్రతా సూచనలు యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

అత్యవసర సమయాల్లో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే, నిమిషాల వ్యవధిలోనే పోలీస్ బృందాలు వచ్చి సహాయం అందిస్తాయి. అందుకే ప్రతి ఒక్కరూ తప్పకుండా శక్తి మొబైల్ యాప్‌ను ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుని రిజిస్టర్ కావాలని పోలీసులు తెలియజేశారు.



శక్తి మొబైల్ యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక బృందం

టీచర్ల సీనియార్టీ జాబితా విడుదల వాయిదా

ఏలూరు అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాల విడుదల వాయిదా పడింది. ఇప్పటికే రెండుదఫాలుగా విడుదల చేసిన సీనియార్టీ జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించిన విద్యాశాఖ మలివిడతగా శనివారం విడుదల చేసి, వాటిపైనా అభ్యంతరాలను స్వీకరించి, పరిష్కరించిన అనంతరం తుదిజాబితాలను అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర అధికారులు గతంలో ప్రకటించిన విషయం విదితమే. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లాలోని మొత్తం 11,386మంది ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాల కోసం శనివారం టీచర్లు ఎదురుచూశారు. కాగా చివరినిమిషంలో జాబితాల విడుదలను వాయిదా వేశారు. దీనికి గల కారణాలు తెలియరాలేదు. వాయిదాకు కారణాలు తెలపకపోవడంతో టీచర్లు అసహనం వ్యక్తం చేశారు.

సేవల వినియోగంపై మరింత చైతన్యం రావాలి

ఏలూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్ కుమార్

ఏలూరు క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రయోజన సేవల కార్యాలయం పని విధానం, కేసులను ఏ విధంగా దాఖలు చేసుకోవాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏలూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్ కుమార్ సూచించారు. ఏలూరు పరిధిలోని పారాలీగల్ వలంటీర్లు, పర్మినెంట్ లోక్ అదాలత్ సిబ్బందికి అవగాహన సదస్సును ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ భవనంలో శనివారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్ కుమార్ మాట్లాడుతూ వలంటీర్లు ప్రజల్లో చైతన్యం కలిగించి ప్రజా ప్ర యోజన సేవలైన నీరు- రవాణా, పోస్టల్, బ్యాంకింగ్, విద్య, వైద్య, రియల్ ఎస్టేట్, విద్యుత్ మొదలైన విభాగాలలో సేవలు లోపం ఉంటే పర్మినెంట్ లోక్ అదాలత్‌ను ఆశ్రయించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కా ర్యాలయంలో పిటీషన్ దాఖలు చేసుకోవడానికి ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లే దని పూర్తిగా ఉచితమన్నారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్ పర్సన్ మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ 2023 నుంచి ఈ కార్యాలయం ఉమ్మడి పశ్చిమ గోదా వరి జిల్లా పరిధిలో పనిచేస్తుందని నేటి వరకూ 232 అర్జీలు దాఖలు చేయగా వీటిలో 20 కేసు ల్లో తీర్పులు వెలువరించి రెండు కోట్ల 36 లక్షల 22 వేల 800 రూపాయలను కక్షిదారులకు పరిహారంగా అందించన్నారు.పర్మినెంట్ లోక్ అదాలత్‌ను ఆశ్రయించి పరిహారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి కేకేవీ బులికృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సునీల్ కుమార్

కళకు పట్టం

పలువురిని వరించిన కళారత్న, ఉగాది పురస్కారాలు

నేడు సీఎం చేతుల మీదుగా విజయవాడలో ప్రదానం

ఏలూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. వివిధ రంగాల్లో ప్రావీణ్యులైన వారిని ఎంపిక చేసి కళారత్న, ఉగాది పురస్కారాలను అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు 14 రంగాల్లో సేవలందిస్తున్న వారిలో పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన పలువురిని ఎంపిక చేసి ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సత్కరించనున్నారు. కళారత్న అవార్డులకు ఎంపికైన వారికి రూ.50 వేల పారితోషికం, ఉగాది పురస్కారాలకు ఎంపికైన వారికి రూ.10 నగదు పారితోషికంతోపాటు మెమెంటో, ప్రశంసా పత్రం అందిస్తారు.

కళారత్న పురస్కారాలు

• హరికథ : సప్పా భారతి



ఏలూరు రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఏలూరుకు చెందిన హరికథ కళాకారిణి డాక్టర్ సప్పా భారతి 12వ ఏట నుండే శ్రీ సర్వారాయ హరికథ పాఠశాలలో శిక్షణ పొంది నేటికి ఐదు వేలకు పైగా హరికథ గానాలు చేసి పలువురు ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. స్వర్ణకంకణ బహు సన్మాన గ్రహీతగా, రజిత కిరీట ధారిణిగా ఎన్నో బిరుదు లు, సత్కారాలు అందుకున్నారు. హరికథా గానాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్న ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమ పురస్కారం కళారత్న (హంస)ను ప్రకటించింది. తనకు ఈ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని, ఇది హరికథకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపారు.

• నాట్యం : పార్వతి రామచంద్రన్



ఏలూరు రూరల్ : ఏలూరుకు చెందిన ప్రముఖ కూచిపూడి, భరతనాట్యం విభాగంలో నాట్య విధుషీమణి ఎ.పార్వతి రామచంద్రన్‌కు ప్రభుత్వం ఉగాది సందర్భంగా హంస అవార్డు, కళారత్న పురస్కారం ప్రకటించింది. ఆమె ఏలూరులో 45 ఏళ్ళుగా కళాదీపిక నృత్య అకాడమి ద్వారా వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులను నృత్య కళాకారులుగా తీర్చిదిద్దారు. ఉత్తమ నాట్య గురువు, నాట్య కళాకారిణి, సంగీత కళాకారిణి ఎన్నో సంస్థలు వివిధ బిరుదులు, సన్మానాలతో గౌరవించారు. ఆవిడ జీవితం నాట్యానికి అంకితం చేసిన గొప్ప కళాకారిణి. ఉగాది పురస్కారం లభించడం పట్ల నగరంలోని పలువురు ప్రముఖులు, నాట్య గురువులు అభినందనలు తెలియచేశారు.

• సాహిత్యం : ఎస్.వి.రామారావు



ఏలూరు రూరల్ : ఫిలిం జర్నలిస్టుగా, సినీ విశ్లేషకునిగా ఎస్.వి.రామారావు సుపరిచితులే. ప్రభుత్వం కళారత్న పురస్కారాన్ని ప్రకటించింది. ఆయన ఇప్పటి వరకు తెలుగు సినీ చరిత్ర మీద 15 పుస్తకాలు రాశారు. రెండు నంది అవార్డులు అందుకున్నారు. వనిత, దూరదర్శన్, భక్తి చానల్‌లలో, సినిమాలకు వెయ్యి కార్యక్రమాలకుపైగా వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఉత్తమ వ్యాఖ్యాతగా నంది అవార్డు అందుకున్నారు. రేడియో, సినిమా, టీవీలలో సినిమాల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సినీ విజ్ఞాన విశారద బిరుదును పొందారు. ఏలూరు గరికపాటి ఆర్ట్స్ థియేటర్ సంస్థకు ఆయన అత్యంత ఆప్తులు. ఉగాది పురస్కారం రావడం తనకెంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

• ఇంద్రజాలం : డాక్టర్ బోస్



భీమవరం అర్బన్ : ఇంద్రజాల ప్రదర్శనలో విశేష కృషి చేస్తున్న భీమవరానికి చెందిన దంతులూరి సత్యనారాయణ రాజు(డాక్టర్ బోస్)కు రాష్ట్ర ప్రభుత్వం కళారత్న అవార్డుతో సత్కరించనుంది. ఆయన డిగ్రీతోపాటు మ్యాజిక్ రంగంలో డాక్టరేట్‌ను సంపాదించారు. పీపుల్స్ మేజిక్ సర్కిల్ ప్రెసిడెంటు గాను, ఇంద్రజాలం, ఇంద్రజాల ప్రపంచం, మాయాదండం, మేజిక్ మాస పత్రికల ఎడిటర్‌గా, బోస్ మేజిక్ స్కూల్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఇప్పటి వరకు 20కు పైగా గ్రంథాలను రచించారు, అమెరికన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యురోపియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వంటి 13 రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. జాతీయ అంతర్జాతీయంగా 70 అవార్డులు, 15 బిరుదులు పొందారు. వందకు పైగా మేజిక్ ట్రిక్‌లు, మేజిక్ పరికరాలను కనుగొన్నారు. ఏటా బోస్ సొంతంగా మేజిక్ రంగానికి విశిష్ట సేవలందించిన తోటి మేజిక్ కళాకారులకు 50 వేల నగదుతో బోస్ మేజిక్ అవార్డ్స్‌ను అందిస్తున్నారు.

• సాహిత్యం : రసరాజు



తణుకు : ప్రముఖ పద్య, గజల్ కవి, రచయిత రసరాజుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న పురస్కారం ప్రకటించింది. సాహిత్యంలో 70 ఏళ్ల నుంచి అనేక పద్యాలు రాశారు. ఐదేళ్ల వయసులోనే తన తండ్రి కాశిరాజు నుంచి రాయడం నేర్చుకున్నారు. కంద పద్యం నేర్పించారు. అప్పటి నుంచి పద్యాలు, కథలు రాసేవారు. ఆయన రాసిన పద్యాలకు గరికిపాటి, జగ్గయ్య వంటి వారి ప్రశంసలు అందుకున్నారు. సినిమా పాటల గురించి చెప్పనక్కర్లేదు. అసెంబ్లీ రౌడీ సినిమాలో 'అందమైన వెన్నెలలోన అచ్చతెలుగు పడుచువలె' పాటకు ఉత్తమ కళాసాగర్ అవార్డును మద్రాసులో అందుకున్నారు. గజల్స్‌కు శ్రీనివాసు మంచి పేరు తీసుకొచ్చారు. అమెరికాలో సంగీత నృత్య రూపకం తెలుగు తోరణాన్ని 2011లో ప్రదర్శించారు. అందులో గొంగూర నుంచి గోవిందుడి వరకు ఉంటుంది. ఈ ప్రదర్శనలో రజరాజును చినజీయర్ స్వామి మెచ్చుకున్నారు. పలు టివి షోలో పాల్గొని పలు అవార్డులు అందుకున్నారు.

• బుర్రకథ : సబ్బి కనకారావు



జంగారెడ్డిగూడెం : మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన బుర్ర కథ కళాకారుడు సబ్బి కనకారావుకు రాష్ట్ర ప్రభుత్వం కళారత్న (హంస) అవార్డును ప్రకటించింది. అగ్గిరాముడు సినిమాలోని బుర్ర కథను చూసి ఈ కళపై ఆసక్తి పెంచుకున్నారు. 1953 డిసెంబరు 15న తొలిసారిగా తంబూర చేతపట్టి ప్రదర్శన ఇచ్చారు. 86 ఏళ్ల వయసులో 70 ఏళ్లపాటు బుర్రకథ కళాకారుడిగా కొనసాగారు. నాటి సినీ నటుడు నాగభూషణం ప్రజా నాట్యమండలి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అందులో చేరి బుర్రకథల ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చారు. 1981లో కనకారావు 'శ్రమజీవులు, సమా జం మారాలి' రచనలు చేసి ఉత్తమ కథకుడు, ఉత్తమ దళం విభాగంలో అవార్డులు పొందారు. బొబ్బిలియుద్ధం బుర్రకథకు ఆయనకు రాష్ట్ర స్థాయిలో పేరు తెచ్చింది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా కొన్ని వేల ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన బుర్ర కథకు చేసిన సేవకు గాను ఈ అవార్డుకు ఎంపిక చేయడంపై కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉగాది పురస్కారాలు

• సాహిత్యం : జంధ్యాల వేంకటరామశాస్త్రి



పెదపాడు : పెదపాడు మండలం వట్లూరులోని ఇంద్రప్రస్థలో నివాసముంటున్న కళ్యాణశ్రీ జంధ్యాల వేంకటరామశాస్త్రి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. పాలకొల్లు స్వస్థలం కాగా, పాలకొల్లులోని ఓరియంటల్ కాలేజీలో తెలుగు, హిస్టరీ లెక్చరర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. జంధ్యాల పాపయ్యశాస్త్రి స్ఫూర్తిగా కళ్యాణశ్రీ అనే కలం పేరుతో రచనలు, కథలు, కవితాలు రాయడంతోపాటు అనేక అవధానాలు చేశారు. పంచారామ క్షేత్రాలపై క్షీరారామ వైభవం అనే పుస్తకాన్ని రచించారు. తొలిసారిగా ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం తీసుకోనుండడం సంతోషకరంగా ఉందని ఆయన తెలిపారు.

• సాహిత్యం : వారణాసి నాగలక్ష్మి



నరసాపురం : తెలుగు సాహిత్యంలో నరసాపురం పట్టణానికి చెందిన వారణాసి నాగలక్ష్మికి ఉగాది పురస్కారం లభించింది. తెలుగులో ఎంఫిల్ పూర్తి చేసిన ఆమె అనేక కథలు, కవితలు, పాటలు రచించారు. 2004లో తెలుగు విశ్వ విద్యాలయం సాహితీ పురస్కారం ప్రకటించింది. 2005లో అబ్బూరి రుక్మిణమ్మ నవ రచాయిత పురస్కారం, 2009లో ఎంవీఎల్ సాహితీ సత్కారం, 2011లో ఉత్తమ కథా రచయిత పురస్కారం, 2017లో అపు రూప కథా పురస్కారాలు వచ్చాయి. 1980లో మొదటి కథ పాప ఫలాంత వైభవం రాశారు. అప్పటి నుంచి అనేక కథలు, గేయాలు, పాటలు, చిత్రలేఖనం చేస్తూ వచ్చారు. ప్రస్తుతం విద్యార్థులకు చిత్ర లేఖనంపై శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వం ఉగాది పురస్కారానికి ప్రకటించడంపై ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు.

• పద్యం : పాలపర్తి శ్రీధర్



నరసాపురం రూరల్ : నరసాపురం మండలం సరిపల్లికి చెందిన పాలపర్తి శ్రీధర్‌కు పద్యంలో రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారం లభించింది. 1966లో జన్మించిన శ్రీధర్ ఇప్పటి వరకు 75కు పైగా పుస్తకాలు రచించారు. వాటిలో లక్షల గ్రంథం ఎంతో ప్రాచుర్యం పొందింది. ప్రస్తుతం ఆయన ప్రభుత్వ శాఖలో వసతి గృహాధికారిగా పని చేస్తున్నారు. 2023లో తెలుగు భాషా విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. వీటితోపాటు సాహితి సేవారత్న, ఆధునిక వేమన, పద్య కవితా సుధానిధి, సుమధుర సాహితీ భూషణ, మధుర కవి, గజిల్ సౌరభౌమ, గజిల్ శతక చక్రవర్తి, ఆధునిక చందో లక్షణ గ్రంథ సృష్టికర్త, కళారత్న అవార్డులు అందుకున్నారు. ఉగాది పురస్కారం లభించడం ఎంతో అనందంగా ఉందని శ్రీధర్ తెలిపారు.

• సాహిత్యం : తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి



పాలకోడేరు : పాలకోడేరు జడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి (తెన్నేటి మాస్టారు)కి రాష్ట్ర ప్రభుత్వ ఉగాది సాహితీ పురస్కారం లభించింది. తెన్నేటి మాస్టారు కవిగా, రచయితగా, నటునిగా, దర్శకునిగా, సభా వ్యాఖ్యాతగా, ప్రయోక్తగా పేరు పొందారు. నేర్చుకునే హృదయముంటే సృష్టిలో ప్రతీదీ ఒక పాఠమే అంటారు. నిడమర్రు మండలం పెదనింద్రకొలనుకు చెందిన ఆయన చిన్ననాటి నుంచి తెలుగు భాష, సాహిత్యంపై మక్కువ పెంచుకుని బీఏ(ఓఎల్), తెలుగులో ఎంఏ, బీఈడీ చేశారు. తెలుగులో యువప్రవక్తలైన కందుకూరి, రాయప్రోలు, గురజాడ, మధురాపంతులు సాహిత్య ప్రభావంతో తెన్నేటి రాసే కవితలు, వ్యాసాలు, ఇతర రచనలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఎన్నో వేదికలపై ఎన్నో సన్మానాలు, సత్కారాలు అందుకున్నారు. తనకు అవార్డు రావడం ఆనందంగా వుందని ఆయన తెలిపారు.

• నాటకం : చేగొండి సత్యనారాయణమూర్తి



యలమంచిలి : దొడ్డిపట్లకు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ చేగొండి వీర వెంకటసత్యనారాయణమూర్తి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. 1974లో పాలకొల్లు ఛాంబర్ జూనియర్ కళాశాలలో అధ్యాపకునిగా చేరి 14 ఏళ్ల పాటు ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. వృత్తిని కొనసాగిస్తూనే నాటక రంగానికి విశేష సేవలందించారు. చిన్నతనం నుంచి మధురమైన పద్యగానంలో విశేషమైన ప్రజ్ఞను సాధించారు. భువన విజయం, ఇంద్రసభ, ప్రబంధ సుగంధం పద్యకవిత వైభవం మొదలగు సాహితీ రూపకాలలోనూ, భక్తనందనార్, భద్రాకల్యాణం(స్వీయరచన), భక్త పోతన వంటి పద్య నాటకాలలోనూ సంగీత, భక్తిరస ప్రధానమైన పాత్రల పోషణతో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. 2013లో అమెరికాలో జరిగిన 19వ తానా మహాసభలలో స్వయంగా పద్య గానం, వ్యాఖ్యానం చేసిన ఆడియో సీడీని విడుదల చేశారు. దేశ విదేశాల్లో వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. మరోవైపు సామాజిక సేవా కార్యక్రమా ల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. ఆయన కుమారుడు సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్.

• నాటకం : దువ్వి రామారావు



ఏలూరు రూరల్ : కళాకారుల సమస్యలపై నిత్యం పోరాడే దువ్వి రామారావు అఖిలాంధ్ర కళాకారుల సంక్షేమ సంఘం (కళా కేంద్రం) జిల్లా కార్యదర్శిగా షణ్ముఖాంజనేయరాజు, కోరాడ నరశింహరావు, ఆచంట వెంకటరత్నం, వున్నం బసవయ్యతో కలసి పనిచేసారు. తరువాతి కాలంలో హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘంలో జిల్లా రంగస్థలవృత్తి కళాకారుల సంఘంలో పనిచేసారు. కార్మికుడిగా రిటైరయ్యిన తరువాత పూర్తిగా కళారంగానికి అంకితమై ఆంధ్రప్రదేశ్‌లో సకలకళాకారుల సంక్షేమ సంఘం స్థాపించి పాష్త్రంలో వివిధరంగాల కలాకారులను కలుపుకుని చనిపోయిన కలాకారులకు, పేదరికంలో ఉన్న కళాకారులకు, అనారోగ్యంతో ఉన్నవారికి తనవంతు సహాయం అందజేస్తున్నారు.

• శిల్పం : శ్రీనివాస ఉడయార్



తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెంకు చెందిన ప్రముఖ శిల్పి శ్రీనివాస ఉడయార్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం ప్రకటించింది. ఆయన కొన్ని వందల శిల్పాలకు జీవం పోశారు. తన తల్లి దేవికారాణి మహిళా శిల్పిగా ఎంతో మంది ప్రముఖుల శిల్పాలకు ప్రతిరూపం ఇచ్చారు. చిన్నతనం నుంచి ఆమె వద్ద శిక్షణ పొందారు. దేశంలోని ప్రముఖ నాయకులు విగ్రహా లను రూపొందించారు. ఆయన 2018లో ఉగాదికి జిల్లాస్థాయి పురస్కారం అందుకోగా ఈ ఉగాదికి రాష్ట్రస్థాయి పురస్కారం ప్రకటించింది.

ఎర్ర కాలువలో ఇద్దరు యువకుల మృత్యువాత



జంగారెడ్డిగూడెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కొంగువారి గూడెం ఎర్ర కాలువ జలాశయం కుడికాలువలో ఇద్దరు యువకులు శనివారం ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. జంగారెడ్డిగూడెం పట్టణం బుట్టాయగూడెం రోడ్డులోని చంద్రశేఖర రైస్ మిల్లు ఎదురుగా నివాసముంటున్న కాసరగౌడ వంశీ సుబ్రహ్మణ్యం (25), భారత్ పెట్రోల్ బంకు ఎదురుగా నివాసం ఉంటున్న రామనారాయణ వంశీకృష్ణ (23) వరుసకు బావ,బావమరుదులు. శనివారం ఎర్రకాలువ జలాశయం దగ్గరకు వెళ్ళి కుడి కాలువలో స్నానానికి దిగి మునిగిపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను గజ ఈతగాళ్ళతో బయటకు తీయించారు. మృతదేహాల వద్ద తల్లిదండ్రులు రోధించిన తీరు అక్కడ ఉన్నవారిని కంటతడి పెట్టించింది.

పాత కేసులు రాజీ చేస్తావా, ఉద్యోగం నుంచి తీసేయాలా?

మహిళా ఉద్యోగిపై జనసేన నాయకుల హుకుం

తణుకు రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): 'పాత కేసులు రాజీ చేస్తావా ? ఉద్యోగం వదిలేస్తావా?' అంటూ తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామానికి చెందిన పంచాయతీ కాంట్రాక్టు బిల్లు కలెక్టర్ నీలం వెంకటలక్ష్మిపై జనసేన నాయకులు దౌర్జన్యం చేసి బెదిరించారు. ఎస్‌ఐ కెచంద్రశేఖర్ తెలిపిన వివరాలివి.. వెంకటలక్ష్మి పదేళ్లగా కాంట్రాక్టు పద్ధతిలో బిల్లు కలెక్టర్‌గా పనిచేస్తోంది. తండ్రి చనిపోవడంతో తల్లి, చెల్లెలుతో కలిసి జీవిస్తోంది. గ్రామానికి చెందిన జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల వేణుగోపాల చంద్రశేఖర్, పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీరాముల దుర్గారావు, బాధితురాలి సోదరి భర్త పత్తి నరసింహస్వామి గత ఏడాది జూలైలో ఘర్షపడి పోలీసు స్టేషన్‌లో కేసులు పెట్టుకున్నారు. ఆ సమయంలోనే జనసేన నాయకులపై మంగళగిరి పార్టీ కార్యాలయంలో పార్టీ వ్యవహారాలు చూసే అజయ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకున్న జన సేన నాయకులు ఈ నెల 28 సాయంత్రం దువ్వ పంచాయితీ కార్యాలయంలో కూటమి నాయకుల మధ్యలో వేణు, దుర్గారావులు వెంకటలక్ష్మిని వేరే గదిలోకి పిలిచి 'నీవు పంచాయతీలో ఉద్యోగం చేయాలంటే గతంలో మీ బావ పెట్టిన కేసులు రాజీ చేయాలి. లేకపోతే గ్రామంలో తిరగలేవు. ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తాం' అంటూ తనను దూషించినట్లు ఫిర్యాదు చేసింది. దీంతో వేణు, దుర్గారావులపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

పోలీసు శాఖకు డ్రోన్లు, సీసీ కెమెరాలు



అదనపు ఎస్పీ సూర్యచంద్రరావుకు డ్రోన్లను అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

ఏలూరు క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం సింగరాయపాలెం గ్రామంలో ఉన్న గ్రోవెల్ సంస్థ డైరెక్టర్ చింతపల్లి సుధీర్, పొట్లూరి శ్రీనివాస్ 16 లక్షల 4,800 రూపాయల విలువైన రెండు డ్రోన్లు, 8 లక్షల 85 వేల రూపాయల విలువైన 100 సీసీ కెమెరాలను శనివారం మధ్యాహ్నం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావుకు అందించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్న క్రమంలో పోలీస్ విభాగాన్ని సాంకేతికంగా, మరింత సమర్థవంతంగా మార్చేందుకు గ్రోవెల్ కంపెనీ మరో అడుగు వేసి సహాయ పడిందన్నారు. ఈ ఆధునిక సీసీ కెమెరాలు జిల్లా పోలీస్ యంత్రాంగానికి మరింత బలాన్ని చేకూరుస్తాయని, నేరాలను సమర్థవంతంగా గుర్తించేందుకు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు హెచ్‌ఆర్ ప్రతిమ, జనరల్ మేనేజర్ సిద్దిలింగేశ్వర్, ఫైనాన్స్ మేనేజర్ పి శ్రీనివాస్‌లు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఐటీ కోర్ ఆర్ఎస్ఐ నరేంద్ర పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో విజిలెన్స్ తనిఖీలు

ఏలూరు క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : విజిలెన్సు, తూనికలు కొలతల అధికారులు శనివారం తాడేపల్లిగూడెం పట్టణంలోని కిరణా, ఫర్నీచర్ షాపులపై తనిఖీలు చేపట్టారు. తాడేపల్లిగూడెంలోని శ్రీదీప్తి రెక్లిమ్, జనరల్ స్టోర్స్ హారిక ట్రేడింగ్ కంపెనీ, శ్రీ దుర్గా జనరల్ స్టోర్‌లలో తనిఖీలు చేశారు. అక్కడ తయారు తేదీ, తయారుదారుని చిరునామా, గరిష్ట చిల్లర ధర, వినియోగదారుని సేవా ఫోన్ నెంబర్ లేకుండా ఉన్న వస్తువులను గుర్తించారు. ఆ మూడు షాపులపై కేసులను నమోదు చేశారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో సిగరెట్ తాగుతూ..

ఏలూరు టూటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఉద్యోగి బాధ్యతా రాహిత్యానికి ఇది పరాకాష్ట. ప్రతిరోజు ఆయా పారిశుద్య పనుల నిమిత్తం అడిషనల్ కమిషనర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తారు. శనివారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వరరావు చాలా రిలాక్స్‌డ్‌గా బాధ్యతా రాహిత్యంగా పబ్లిక్‌గా వీడియో కాన్ఫరెన్స్‌లో సిగరెట్ తాగుతూ అధికారులు చూస్తుండగానే ప్రవర్తించటం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇటువంటి సంఘటనలు చూస్తే మిగిలిన ఉద్యోగులను కూడా పోత్సహించినట్లు అవుతుంది. ఇటువంటి సహించరాని చర్యలు జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.

మహిళ మృతికి కారణమైన వ్యక్తి అరెస్టు

జంగారెడ్డిగూడెం,మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం మండలం యర్రంపేటకు చెందిన మహిళ దార్ల హేమదుర్గ ప్రసన్న (31)తో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమెను పురుగుమందు తాగేలా ప్రేరేపించి ఆమె మృతికి కారణమైన మోదుగ పెద్దసాయిను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు.

బాలికను కిడ్నాప్ చేసిన ఆటో డ్రైవర్

రక్షించిన హిజ్రాలు

ఏలూరు క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు తిట్టారని ఇంటి నుంచి బయటకు వచ్చిన ఒక బాలికను ఆటో డ్రైవర్ కిడ్నాప్ చేయగా హిజ్రాలు రక్షించారు. వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఏలూరు జిల్లాలో ఓ ప్రాంతానికి చెందిన పదో తరగతి విద్యార్థిని (15) ఆమె తల్లి దండ్రులు శుక్రవారం సాయంత్రం మందలించారు. దీంతో కోపగించుకుని ఆ బాలిక ఏలూరు కొత్త బస్టాండ్‌కు వచ్చి ఒంటరిగా కూర్చొని ఉంది. అర్ధరాత్రి వేళ ఒక ఆటో డ్రైవర్ ఆ బాలిక వద్దకు వెళ్ళి మాయమాటలు చెప్పి ఆమె ఇంటికి తీసుకువెళ్తానని చెప్పి కిడ్నాప్ చేసి ఏలూరు పోణంగి రోడ్డులో ఉన్న ఆటో డ్రైవర్ ఇంటికి తీసుకువెళ్ళాడు. ఆ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో వెంటనే తప్పించుకుని బయటకు వచ్చింది. ఆ ప్రాంతంలో ఉన్న హిజ్రాలు బాలికను గుర్తించి ఆమె నుంచి వివరాలు అడిగి తెలుసుకుని తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లి దండ్రులు వచ్చి బాలికను తీసుకువెళ్ళారు. శనివారం ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆటో డ్రైవర్ రక్ష ప్రభాకరరాజు (40)పై ఫిర్యాదు చేశారు. దీంతో ఆటో డ్రైవర్‌పై ఏలూరు త్రి టౌన్ పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గూటాల ఫెర్రీ రేవు వేలం వాయిదా

పోలవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : గూటాల గ్రామ పంచాయతీ పరిధిలో గోదావరిలో రేవు పడవ నడుపుకొనుటకు నిర్వహించే బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు కార్యదర్శి తాతా విజయకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఏప్రిల్ నెలలో రేవు పాట నిర్వహిస్తామని తెలిపారు.

కాంటూరును కుదించాలంటూ ధర్నా

ఏలూరురూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరును ఐదు నుండి మూడవ కాంటూరుకు కుదించాలని, కొల్లేరు ప్రజలకు ఉపాధి కల్పించాలని, సొసైటీలు, జిరాయితీ భూములు పునరుద్ధరించి మిగులు భూములు కొల్లేరు పేదలకు పంచాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

సుదర్శన కల్యాణ వెంకన్నకు భక్తుల తాకిడి

పోలవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ సుదర్శన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడి ఎక్కువైంది. భక్తులకు ప్రసాద వితరణ అన్నదాన నిర్వహణ కార్యక్రమాలు కమిటీ మహిళలు నిర్వహించారు. సుమారు 2,500 మంది భక్తులు దర్శనం చేసుకున్నట్టు అర్చకులు శంకరమంచి వెంకట్రామ శర్మ తెలిపారు.

నేటి కంచి కామాక్షి తిరు కల్యాణోత్సవాలు

కామవరపుకోట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఆడమిల్లి గ్రామంలోని కంచి కామాక్షిదేవి సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయం వద్ద ఈనెల 30 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు 67వ వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉగాది సందర్భంగా కంచి కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించి అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

శ్రీవారి సేవలో శ్రీకాళీవనాశ్రమ పీఠాధిపతి



ద్వారకాతిరుమల, మార్చి29 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని నంబూరులోని శ్రీకాళీవ నాశ్రమం పీఠాధిపతి శ్రీచంద్ర కాళిప్రసాద మాతాజీ శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు దేవాలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేకపూజలు జరుపుకున్నారు. ఆ తరువాత అర్చకులు ఆమెకు స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు, వేదాశీర్వచనం ఇచ్చారు.

కాజ్‌వేపై ఇరుక్కున్న లారీ



పెదపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు, వరదలకు దెబ్బతిన్న పెదపాడు-వట్లూరు కాజువే మీదకు సిమెంట్ లోడుతో వచ్చిన ఓ లారీ ఇరుక్కుపోయింది. మండలంలోని ఖాజీగూడెం గ్రామానికి సిమెంట్ బస్తాలతో బయలుదేరిన లారీ దగ్గర దారిగా భావించి వట్లూరు-పెదపాడు రహదారిలోకి వచ్చారు. మార్గంమధ్యలో ప్రమాదకరస్థితిలో వున్న కాజువేను దాటేందుకు ప్రయత్నించడంతో లారీ బరువుకు కాజువే మరింత కుగింది. దీంతో లారీ ముందుకు, వెనుకకు వెళ్లే మార్గం లేక నిలిచిపోయింది.

రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఉగాది వేడుకలు

పెదపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఏంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు శనివారం జరిగాయి. మైలవరపు లక్ష్మీనరసింహం పంచాగ శ్రవణం నిర్వహించగా పి.రమ్య బృందం కోలాట నృత్యాలతో ఆకట్టుకున్నారు. విద్యార్థినులు హిందు సంప్రదాయ వస్త్రధారణతో అలరించగా, అందరికీ ఉగాది పచ్చడి అందజేశారు.

పారిశుధ్య కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

పోలవరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పోలవరం పంచాయతీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పారిశుధ్య కార్మికుడు సరిపల్లి ఆనంద్ కుటుంబానికి సర్పంచ్ పోడుం పుష్ప, పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు శనివారం 15వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు.

మసీదులో ప్రత్యేక ప్రార్థనలు.. ఇఫ్తార్ విందు

పోలవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసం ముగింపు సందర్భంగా పోలవరం మసీదులో శనివారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీద్ కమిటీ అధ్యక్షులు ఎండి యాసీన్ షరీఫ్ మాట్లాడుతూ రంజాన్ మాసం ముగింపు రానున్న సందర్భంలో ప్రత్యేక ప్రార్థనల కోసం మసీదులో స్థలాభావం వలన స్థానిక భాను థియేటర్ సమీపంలో ఉన్న ఈద్గా స్థలంలో ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సబ్సిడీ రుణాలు అందేనా ?

పెదపాడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం సబ్సిడీతో రుణాలను పొందేందుకు బి.సి. కార్పొరేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హత వున్న అభ్యర్థులు దరఖాస్తుకు తొలుత ఈనెల 23, అనంతరం 25వ తేదీకి గడువు పొడిగించారు. 25వ తేదీ సాయంత్రంతో గడువు ముగిసినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండటంతో 26, 27వ తేదీల్లో కూడా పలువురు లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తును ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని అధికారులు సూచించడంతో వారంతా ఆన్‌లైన్ దరఖాస్తులతో వెళ్లారు. గడువు 25వ తేదీలోగా ఆన్‌లైన్ చేసిన అప్లికేషన్స్ మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని సిబ్బందితో చెప్పడంతో గడువు ముగిసిన తరువాత అనగా 26, 27వ తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నవారు అయోమయంలో పడ్డారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు, జిరాక్స్‌లతో కలిపి సుమారు రూ.300 నుంచి రూ.400 ఖర్చు అయిందని, కార్యాలయంలో అప్లికేషన్ అందజేసేందుకు ఆరోజు ఉపాధిని కూడా కోల్పోయామని, ఇప్పుడు మా దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోకపోతే మేము నష్టపోవాల్సి వస్తుందని పలువురు లబ్ధిదారులుఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

ఉంగుటూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం గ్రామానికి చెందిన నామాల నరసింహం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో శనివారం నాడు మండల మానవత అధ్యక్షులు వేగేశ్న రంగరాజు చేతుల మీదుగా రూ.11,500 అందజేశారు. రీజియన్ చైర్మన్ పుప్పాల గోపీ, మండల చైర్మన్ గుణ్ణం బుల్లెబ్బాయి, శీతాల సత్యనారాయణ, వేగేశ్న సూర్యనారాయణరాజు, రామిరెడ్డి వెంకట రెడ్డి పాల్గొన్నారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి



నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

ఏలూరురూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు పిలుపు నిచ్చారు. శనివారపుపేటకు చెందిన రిటైర్డ్ ఇరిగేషన్ ఉద్యోగి పైడిపాలి శ్రీనివాసరెడ్డి కుమారుడు లోకేష్‌రెడ్డి ఉన్నత ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా వంద మంది పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు అందించి తమ సేవా నిరతిని చాటుకున్నారు. శానిటరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సాయి ఫణీంద్ర పాల్గొన్నారు.

తెలుగుతమ్ముళ్ల మధ్య విభేదాలు

టి.నర్సాపురం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలో తెలుగు తమ్ముళ్ళ మధ్య మరోసారి విభేదాలు భగ్గుమన్నాయి. వివరాల్లోకి వెళ్తే టి.నర్సాపురం అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావుగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు ఏర్పాటు చేశారు. అదే క్రమంలో పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ ఫొటోలేకపోవడంతో కొందరు కార్యకర్తలు మండల అధ్యక్షుడిని ప్రశ్నించారు. దీంతో రెండువర్గాల మధ్య మటామాట పెరిగి వివాదానికి దారి తీసింది. కొద్దిసేపు తోపులాట చోటు చేసుకుంది. ఆ తర్వాత పెద్దలు ఫ్లెక్సీని తొలగించి ఇరువర్గాల మధ్య వివాదాన్ని సద్దుమణిగించారు.



ఏలూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని, ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్.. దెందులూరు మండలంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే చింతమనేని నివాళులు.. ద్వారకాతిరుమల మండలం మారంపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి.. కొత్తూరులో ఎన్టీఆర్‌కు టీడీపీ నాయకుల నివాళులు

తెలుగువారి ఆత్మగౌరవం టీడీపీ

ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ద్వారకాతిరుమల/పెదపాడు/దెందులూరు/బుట్టాయగూడెం/పోలవరం/ఏలూరు టూటౌన్/కామవరపుకోట/పెదవేగి /టి.నరసాపురం/కొయ్యలగూడెం/కుక్కునూరు/లింగపాలెం/జంగారెడ్డిగూడెం/ఏలూరు రూరల్/భీమడోలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాలకు అండగా అన్న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి తెలుగువాడి ఆత్మగౌరవాన్ని దశదిశలా వ్యాప్తి చేశారని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ద్వారకాతిరుమల మండలంలోని మారంపల్లిలో పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్క రించారు.

- తెలుగువారి ఆత్మగౌరవం పెరిగేలా రాజకీయాలను ప్రజల చెంతకు చేర్చిన రోజు మనందరికి పండుగ రోజని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. కొత్తూరులో జరిగిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే ప్రభాకర్ నివాళులర్పించారు. కొనికిలో సర్పంచ్ పొట్లూరి యుగంధర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు.
- దెందులూరు నాలుగు రోడ్ల జంక్షన్‌లో స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎమ్మెల్యే ప్రభాకర్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు యిప్పిలి వెంకటేశ్వరావు. కొండయ్యా చౌదరిలతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్. తెలుగుయువత అధ్యక్షుడు మోతుకూరి నాని బాబు, గ్రామ సర్పంచ్ తోట యేసమ్మ తదితరులు పాల్గొన్నారు.
- బుట్టాయగూడెం మండలంలోని కండ్రికగూడెం, కొమ్ముగూడెం సెంటరులో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.
- పోలవరం మండల కేంద్రంలో మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహానికి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏటిగట్టు సెంటర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు.
- ఏలూరు టీడీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబులు పాల్గొన్నారు. ఎంపీ కార్యాలయంలో ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ ఆదేశాల మేరకు టీడీపీ నేతలు ఆవిర్భా దినోత్సవాన్ని నిర్వహించారు. 5వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.
- కామవరపుకోట మండలం కొత్తూరు ఆర్అండ్‌బి బంగ్లా సమీపంలో గల ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఘంటా సత్యంబాబు, మాజీ ఎంపీపీ వెంకట్రావులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
- పెదవేగి మండలం దుగ్గిరాలలో ఎమ్మెల్యే చింతమనేని టీడీపీ పతాకాన్ని ఎగురవేసి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేశారు. విజయరాయిలో పార్టీ నాయకులు దారిబోయిన సత్యనారాయణ, రావిపాటి పిచ్చియ్యచౌదరి, బిర్లంగి పెద్దులు పాల్గొన్నారు.
- టి.నర్సాపురం అంబేడ్కర్ సెంటర్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణరావు గౌడ్, తిరుమలదేవిపేట తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, తెడ్లం గ్రామంలో కేతిరెడ్డి వీరారెడ్డి, బండి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బొరగం శ్రీనివాస్ హాజరయ్యారు.
- కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన వేడుకలకు రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీచైర్మన్ పారేపల్లి రామారావు, తెలుగు మహిళా ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి, మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేశ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు జ్యేష్ట రామకృష్ణ, టీడీపీ తెలుగు మహిళా అధ్యక్షులు చింతల వెంకటరమణ పాల్గొన్నారు.
- కుక్కునూరులోని ప్రధాన సెంటర్ నుంచి రామాలయం సెంటర్ వరకు ద్విచక్రవాహనాలపై జై ఎన్‌టీఆర్, జై చంద్రబాబు అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామాలయం సెంటర్‌లో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, ఉప సర్పంచ్ పిచ్చుక రాజు పాల్గొన్నారు.
- లింగపాలెం, మఠంగూడెం, ధర్మాజీగూడెం గ్రామాలలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నా రు. లింగపాలెంలో తెలుగుదేశం పార్టీ జండా ఆవిష్కరించి అనంతరం నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- జంగారెడ్డిగూడెం అశ్వారావుపేట రోడ్డులో కాకర్ల కాంప్లెక్స్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక 9,10,11 వార్డుల్లో నూతనంగా నిర్మించిన టీడీపీ స్థూపాన్ని టీడీపీ నాయకులు పరిమి సత్తిపండు, ఈడా శ్రీనివాస్ ప్రారంభించారు. స్థానిక సంత మార్కెట్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.
- ఏలూరురూరల్ మండలం మల్కాపురంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభా కర్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జెండా ఎగుర వేశారు.
- భీమడోలు గ్రామంలోని గాంధీ బొమ్మ సెంటర్, సంతమార్కెట్, వడ్లపట్ల తదితర ప్రాంతాల్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు తెలుగుదేశం పార్టీజిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.
- చింతలపూడిలోని మేడబడి సెంటర్‌లో ఎమ్మెల్యే రోషన్ కుమార్ శనివారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి జెండా ఆవిష్కరించారు. యర్రగుంటపల్లిలో మాజీ జడ్పీటీసీ టి.రాధారాణి జెండా ఆవిష్కరించారు.



లింగపాలెంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్



బుట్టాయగూడెంలో కేక్ కట్ చేస్తున్న బొరగం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, గన్ని తదితరులు

క్రొవ్విడిలో ఇఫ్తార్ విందు

నిడమర్రు మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ సందర్భంగా క్రొవ్విడిలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఘంటా ప్రసాద్, పుప్పాల హరీష్, మహ్మద్ సాజిద్, మహ్మద్ మాజిద్, మహ్మద్ గఫ్ఫార్‌ఖాన్, ఎండి జాకీర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య నివారించాలి

ఏలూరు సిటీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో జిల్లాలో ఎక్కడా మంచినీటి కొరత ఏర్పడకుండా గ్రామాల్లో అవసరమైన చోట్ల మంచినీటి బోర్లు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

2న మామిడితోట ఫలసాయం వేలం

కుక్కునూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామ శివారులో 18ఎకరాల మామిడి తోటకు సంబంధించి అందులో వచ్చే ఫలసాయంపై వచ్చే నెల 2వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు కుక్కునూరు తహసీల్దార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటలో దాదాపు 350 నుంచి 400మామిడి చెట్లు ఉన్న క్రమంలో అందులో వచ్చే ఫలసాయం పై వేలంపాట నిర్వహించనున్నారు.

మైనార్టీ వర్గాలకు టీడీపీ అండ

కొయ్యలగూడెం, మార్చి29 (ఆంధ్రజ్యోతి): ముస్లిం, మైనార్టీ వర్గాలకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. ఈ మేరకు శనివారం ఆమె ఇంటి వద్ద టీడీపీ ఆవిర్భావ దినోత్సవం, రంజాన్ సందర్భంగా 25మంది ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రీయాన, ముస్లిం పెద్దలు రీయాజ్, మోహిద్దీన్, జహింగిర్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు 118 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 (సంస్కృతం), ఒకేషనల్ కోర్సు (థియరీ)పరీక్షలకు జిల్లాలో 2764మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకోగా 2646మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

సీఆర్ఆర్ విద్యార్థుల రక్తదానం

ఏలూరు అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సీఆర్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, హెల్త్‌సెంటర్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 24మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానమిచ్చారని ప్రిన్సిపాల్ రామరాజు తెలిపారు. కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రోగ్రాం ఆఫీసర్లు భాషా, శంకర్, ధర్మేంద్ర, కెజియ పాల్గొన్నారు.

2న చైతన్య స్పోర్ట్స్‌మీట్

ఏలూరు అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీ చైతన్య స్కూలు వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ బి.ఎస్.రావు స్మారక స్పోర్ట్స్‌మీట్‌ను స్థానిక విద్యానగర్ చైతన్య స్కూలులో ఏప్రిల్ 2న నిర్వహిస్తున్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, భీమడోలు, ఆకివీడు, భీమవరం బ్రాంచిల బాలబాలికలు ఈ క్రీడోత్సవాల్లో పాల్గొంటారని ఏజీఎం పార్థసారథి తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి

భీమడోలు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, క్రైస్తవులపై దాడులను అరికట్టాలని భీమడోలు మండల ఐక్యపాస్టర్ల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు భీమడోలు మండల తహసీల్దార్ రమాదేవి, ఎస్ఐ సుధాకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

సీఎం పీ-4 సదస్సుకు జిల్లా నుంచి 1500 మంది

ఏలూరు,మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో ఉగాది సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు నిర్వహించే పీ-4 సదస్సుకు ఏలూరు జిల్లా నుంచి 1500 మంది ఔత్సాహికులను అక్కడకు ఆదివారం తీసుకెళ్లనున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం సుమారు 37 బస్సుల్లో వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణలో బస్సుల్లో తరలించనున్నారు. రాత్రి భోజనం అనంతరం జిల్లాకు వారిని తరలించనున్నారు.

మారంపల్లిలో సీసీ రోడ్డు ప్రారంభం

ద్వారకాతిరుమల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మారంపల్లిలో నూతనంగా రూ.1.20కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డును శనివారం గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలను సైతం తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేని వైసీపీ రాక్షసులు కుటిల యత్నాలు చేస్తున్నారన్నారు. ఇటీవల నల్లజర్లలో అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు చెప్పుల దండలు వేసిన వైసీపీ రాక్షసులు మరలా రోడ్లపైకి వచ్చి న్యాయం చేయమని మొసలి కన్నీరు కారుస్తూ ధర్నా చేసి ప్రజల జీవితాలకు ఇబ్బందులు కలుగచేస్తున్నారని అన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

చింతలపూడి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఏరియా ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శనివారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని వార్డులలో రోగులకు పండ్లు, రొట్టె పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ల కొరత, ఆసుపత్రి సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రూ.54 లక్షలు పలికిన ఆశీలు

ఏలూరు టూటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): 2025 - 26 సంవత్సరానికి ఆశీలు పాట రూ.54లక్షల 10వేలకు వెళ్ళింది. చిరువ్యాపారుల నుంచి వసూలు చేసే ఆశీలు పాటకు నగరపాలక సంస్థలో శనివారం ముగ్గురు వ్యక్తులు పాల్గొన్నారు. సర్కారివారిపాట రూ.53.83 లక్షలతో మొదలైంది. చివరికి ముగ్గురు పోటీపడగా వారిలో ఆర్నేపల్లి తిరుపతి రూ.54.10 లక్షలకు పాడారు.

సబ్ జైలు తనిఖీ

చింతలపూడి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సబ్ జైల్‌ను ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్‌కుమార్ శనివారం తనిఖీ జరిపారు. నిందితుల కేసుల వివరాలను పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న ఆహారం, మంచినీరుపై ఆరా తీశారు. తయారైన భోజనాన్ని రుచి చూశారు. జైలు ప్రాంగణంలో ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు వినియోగించుకోవాలని సూచించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు కార్యాచరణ : కలెక్టర్

ఏలూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు, పాడి ఉత్పత్తులు ఆధారంగా ఆహార శుద్ధి పరిశ్రమలు(ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు) నెలకొల్పేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పరిశ్రమలు, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖలు సమన్వయం చేసుకుని నివేదిక రూపొందించాలన్నారు. రానున్న మూడు నెలల్లో కనీసం 20 యూనిట్లు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్ల గురించి ఆయా శాఖలను సంబంధిత సాంకేతిక సిబ్బంది సమన్వయం చేసుకునేందుకు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ రిసోర్స్‌పర్సన్ పి.హిమవాణిని సమన్వయకర్తగా నియమించారు.

ఇంటర్వ్యూ..

వడ్డీపై 50 శాతం రాయితీ

బి.శివారెడ్డి, డిప్యూటీ కమిషనర్, నగరపాలక సంస్థ



- ఈ ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను ఎంత వసూలు చేశారు?

జవాబు: 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.35 కోట్లు ఆస్తి పన్నులు వసూలు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు రూ.32 కోట్లు వసూలు చేశాం.

- ఆస్తిపన్ను చెల్లించనివారి పై ఏ చర్యలు తీసుకుం టున్నారు ?

జవాబు: ముందుగా నోటీసులు జారీ చేస్తాం. రెడ్‌నోటీసు కూడా జారీ చేసిన తరువాత కట్టకపోతే కుళాయి కనెక్షన్ కట్ చేస్తాం. అవసరమైతే ఆస్తి కూడా జప్తు చేస్తాం.

- ఆస్తిపన్ను చెల్లింపునకు ఎలాంటి రాయితీలు ఉన్నాయి?

జవాబు: ఉగాది, రంజాన్ పండుగ సెలవు దినాల్లో కూడా పన్నులు చెల్లించవచ్చు. మార్చి 31వ తేదీ వరకు మాత్రమే ఉంటుంది. ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీపై 50 శాతం రాయితీ వర్తిస్తుంది.

- ఏలూరు టూటౌన్, ఆంధ్రజ్యోతి



ఆలపాడులో రహదారి పక్కన ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

ఆలపాడులో ఉద్రిక్తత

రహదారి ఆక్రమణల తొలగింపు

కైకలూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రహదారి ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శనివారం కైకలూరు మండలం ఆలపాడు నుంచి కొల్లేటికోట వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆలపాడులోని ఇరువైపులా ఆక్రమణలను అధికారులు తొలగించారు. ఈ రోడ్డులో రెండు వైపులా టిఫిన్ హోటళ్లు ఏర్పాటు చేయడంతో రహదారి వెంబడి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేగాక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3.90 కోట్లతో రహదారి నిర్మాణ పనులను చేపట్టారు. రహదారి నిర్మాణానికి, ప్రజల రాకపోకలకు ఆక్రమణలు అడ్డుగా ఉన్నాయని పంచాయతీ అధికారులు కైకలూరు తహసీల్దార్ ఎండీ ఇబ్రహీంకు, ఆర్‌అండ్‌బీ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు కలిసి ఆక్రమణలు తొలగించేందుకు ప్రయత్నం చేయగా ఆక్రమణదారులు అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. కైకలూరు టౌన్, రూరల్ సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్, నలుగురు ఎస్ఐలు, 50మంది పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చుజెప్పారు. లేదంటే అరెస్టులు తప్పవని హెచ్చరించగా ఆందోళనకారులు వెనక్కి తగ్గారు. ఆపై ఆక్రమణలు తొలగించారు.

పోలీసు శాఖకు డ్రోన్లు, సీసీ కెమెరాలు



అదనపు ఎస్పీ సూర్యచంద్రరావుకు డ్రోన్లను అందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

ముదినేపల్లి/ఏలూరుక్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం సింగరాయపాలెం గ్రామంలో ఉన్న గ్రోవెల్ సంస్థ డైరెక్టర్ చింతపల్లి సుధీర్, పొట్లూరి శ్రీనివాస్ 16 లక్షల 4,800 రూపాయల విలువైన రెండు డ్రోన్లు, 8 లక్షల 85 వేల రూపాయల విలువైన 100 సీసీ కెమెరాలను శనివారం మధ్యాహ్నం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావుకు అందించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్న క్రమంలో పోలీస్ విభాగాన్ని సాంకేతికంగా, మరింత సమర్థవంతంగా మార్చేందుకు గ్రోవెల్ కంపెనీ మరో అడుగు వేసి సహాయ పడిందన్నారు. ఈ ఆధునిక సీసీ కెమెరాలు జిల్లా పోలీస్ యంత్రాంగానికి మరింత బలాన్ని చేకూరుస్తాయని, నేరాలను సమర్థవంతంగా గుర్తించేందుకు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు హెచ్‌ఆర్ ప్రతిమ, జనరల్ మేనేజర్ సిద్దిలింగేశ్వర్, ఫైనాన్స్ మేనేజర్ పి శ్రీనివాస్‌లు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఐటీ కోర్ ఆర్ఎస్ఐ నరేంద్ర పాల్గొన్నారు.



గోపవరం నుంచి ర్యాలీగా వెళ్తున్న టీడీపీ శ్రేణులు

ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణకు తరలిన తెలుగు తమ్ముళ్లు

ముసునూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణకు మండలం నుంచి అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు శనివారం సాయంత్రం తరలి వెళ్లారు. గోపవరంలో యువనేత ఉప్పలపాటి గణేష్ ఆధ్వర్యంలో బైక్‌లపై ర్యాలీగా వెళ్లారు. మిగిలిన గ్రామాల్లో నాయకులు ఆటోలు ఇతర వాహనాల్లో ర్యాలీగా బయలుదేరి వెళ్లి, విగ్రహ ఆవిష్కరణ అనంతరం మార్కెట్‌యార్డ్ ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

కలిదిండి/ముదినేపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో కొండలరావు మాట్లాడుతూ 650 మంది దరఖాస్తు చేసుకోగా 500 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారన్నారు. బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు. ముదినేపల్లి మండలంలో సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు పూర్తయినట్లు ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. 32 గ్రామాలకు చెందిన 1074 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా 1030 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, త్వరలోనే జాబితాలను ప్రకటిస్తామన్నారు.

వాడవల్లి యూపీ పాఠశాలలో ఉగాది వేడుకలు



వాడవల్లి యూపీ స్కూల్‌లో ఉగాది పచ్చడి అందజేస్తున్న హెచ్‌ఎం సాయిలక్ష్మి

ముదినేపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వాడవల్లిలోని మండల పరిషత్తు యూపీ పాఠశాలలో శనివారం ఉగాది వేడుకలను నిర్వహించారు. హెచ్‌ఎం, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షురాలు ఎం.సాయిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు ఉగాది పచ్చడి అందజేశారు. తెలుగు సంవత్సరాది సందర్భంగా విశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కేంద్ర కార్యకర్త, ఆయా పాల్గొన్నారు.

ఉగాది వేడుకలకు ఏర్పాట్లు

ముదినేపల్లి : ఉగాది సందర్భంగా ఆదివారం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో పంచాంగ శ్రవణం నిర్వహించేందుకు, భక్తుల దర్శనానికి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. వడాలి సుభద్ర బలరామ సహిత జగన్నాథ స్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు కోరారు. సింగరాయపాలెం బావాజీ మఠం, గురజ శ్రీరామలింగేశ్వరస్వామి, అల్లూరు సోమేశ్వర స్వామి దేవస్థానాల్లో ఉగాది వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి వీవీఎస్‌వీ లక్ష్మి

కైకలూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మహిళలు వేధింపులకు గురి చేస్తే పోక్సో చట్ట ప్రకారం శిక్షపడుతుందని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మీ అన్నారు. తామరకొల్లు జడ్పీ హైస్కూల్లో శనివారం విద్యార్థినులకు పోక్సో చట్టంపై న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే బాధ్యులపై పోక్సో కేసు నమోదు చేయబడుతుందన్నారు. ప్యానెల్ అడ్వకేట్స్ పి.ప్రసన్న కుమార్, అడగర్ల రాంబాబు, హెచ్‌ఎం జె.కోటేశ్వరరావు, టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ మృతి



సత్యనారాయణ

మండవల్లి మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండవల్లి అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ ఎ. సత్యనారాయణ (55) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధికి చికిత్స పొందుతున్నారు. శనివారం తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆటపాక నుంచి కైకలూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. డీఎఫ్‌వో బి.విజయ, టెరిటోరియల్ రేంజర్ కుమా ర్, కైకలూరు రేంజర్ రామలింగాచార్యులు, అటవీశాఖ సిబ్బంది ఆయన భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

కలిదిండి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కలిదిండి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 2 నుంచి పాలిసెట్ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపల్ డి.ప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 30న పాలిసెట్ పరీక్ష జరుగుతుందన్నారు.ఏప్రిల్ 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



కైకలూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు



నూజివీడులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, తదితరులు



వడాలిలో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న కన్వీనర్ నరసింహారావు, ఏపీ టీడీసీ డైరెక్టర్ వినోద్

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



కలిదిండిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకుల నివాళులు

నూజివీడు టౌన్/చాట్రాయి/ముసునూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవంను నూజివీడు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు జెండాను ఆవిష్కరించి ఆవిర్భావ వేడుకలను ప్రారంభించారు. ఎన్టీయార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నూజివీడు మండలం రావిచర్లలో ఏఎంసీ మాజీ చైర్మన్ కాప శ్రీనివాసరావు ఎన్టీయార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చాట్రాయి మండలంలో చాట్రాయి, చనుబండ, చీపురుగూడెం, కోటపాడు, నరసింహారావుపాలెం తదితర గ్రామాల్లో తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ జెండాలు ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహాల వద్ద నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు బొట్టు రామచంద్రరావు, అత్తులూరి శ్రీనివాసరావు, బొట్టు లక్ష్మణరావు, పలగాని దుర్గారావు, చంద్రకళ, తల్లాడ శ్రీనివాసరావు, నక్కా రాము, మంచిన పూర్ణ, ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, చిమటబోయన పుల్లారావు, బ్రహ్మాజి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ముసునూరు మండలంలోని గోపవరంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బొల్లినేని బుజ్జియ్య. యువనేత ఉప్పలపాటి గణేష్, గుడిపాడులో టీడీపీ సీనియర్ నాయకులు కొల్లి గంగారామ్, మండలపు ధర్మరాజు, లోపూడిలో గ్రామపార్టీ అధ్యక్షుడు వేంపాటి శ్రీనివాసరావు, చెక్కపల్లిలో సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, ఎంపీటీసీ కాటేపల్లి పుష్పావతి శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షుడు కాటేపల్లి ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ కాటేపల్లి సత్యనారాయణ, సీనియర్ నాయకులు పర్వతనేని బాబ్జి, అక్కిరెడ్డిగూడెంలో సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మి, సత్యనారాయణ, పార్టీ ప్రెసిడెంట్ బర్మా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మానురాజు సురేష్ ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్‌లను కట్ చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు.

కైకలూరు నియోజకవర్గంలో..

కైకలూరు/ కలిదిండి/ముదినేపల్లి/మండవల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. కైకలూరులో కోరుకొల్లురోడ్డు, తాలుకా సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ జెండా ఆవిష్కరించారు. గోపవరం, తామరకొల్లు, తదితర గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు వీరమల్లు నరసింహారావు, కొడాలి వినోద్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజెఎస్ మాల్యాద్రి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కలిదిండిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ్రాజు శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. మూల్లంకలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఎత్తిపోతల కమిటీ చైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు, నాయకులు బోళ్ల ఏడుకొండలు, తంగెళ్ల గణపతి, సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు. మట్టగుంటలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ముదినేపల్లి మండలం వడాలిలో టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. పెదపాలపర్రులో మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బొమ్మినంపాడు, అల్లూరు, గురజ, ములకపల్లి, పెదగొన్నూరు, వైవాక, దేవపూడి, చేవూరు, శ్రీహరిపురం తదితర గ్రామాల్లో ఆవిర్భావ దినోత్సవాలు జరిగాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్ర కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. మండవల్లి మండలం భైరవపట్నంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండా వందనం చేసి సంబరాలు నిర్వహించారు. మండవల్లిలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు ఎన్డీయే నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, టీడీపీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు భూమి పూజ చేశారు. భైరవపట్నం సాగునీటి సంఘం అధ్యక్షుడు బొల్లంపల్లి కృష్ణారావు, పెరికేగూడెం సాగునీటం సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, ఎన్డీయే నాయకులు సబ్బా బాబి, నల్లిపోయిన రాజేష్, గుడివాడ బాలాజీ, గజ్జల గణేష్, గుడివాడ గణేష్ తదితరులు పాల్గొన్నారు.







చాట్రాయిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు..ముసునూరు మండలం రమణక్కపేటలో ఎన్టీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం .. మండవల్లి మండలం భైరవపట్నంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు



మాట్లాడుతున్న న్యాయమూర్తి పెదఖాసిం

యనమదలలో న్యాయ విజ్ఞాన సదస్సు

నూజివీడు టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో నెలకొన్న అసమానతలు, వేధింపులపై విద్యార్థులు పూర్తి అవగాహనతో మెలగాలని నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి పెదఖాసిం అన్నారు. యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, న్యాయవాది గోపీనాథ్, పాఠశాల హెచ్‌ఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఒకేషనల్ పరీక్ష ప్రశాంతం

చాట్రాయి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): చాట్రాయి జడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో శనివారం టెన్త్ ఒకేషనల్ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 76 మంది విద్యార్థులకు గాను 75 మంది హాజరయ్యారని ఒకరు మాత్రమే గైర్హాజరయ్యారని ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు.

21 మంది బైండోవర్

నూజివీడు టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సారా తయారీ విక్రయాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని నూజివీడు తహసీల్దార్ బి.సుబ్బారావు హెచ్చరించారు. శనివారం నూజివీడు ఎక్సైజ్ ప్రొహిబిషన్ సీఐ పరిధిలోని సిద్ధార్థ నగర్, పోతురెడ్డిపల్లి గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు 21మందిని బైండోవర్ చేశారు. అయన మాట్లాడుతూ నిందితులు సత్ప్రవర్తనతో మెలుగుతూ తమపై మోపిన అభియోగాల నుంచి బయటకు రావాలన్నారు. నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



ముసునూరులో నూతన బోరు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం కృషి

ముసునూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా అన్నారు. ముసునూరు హిందు శ్మశానవాటికలో నీటి సౌకర్యం కోసం ఎంపీటీసీ నిధులు రూ.2 లక్షలతో వేస్తున్న నూతన బోరు పనులను ఎంపీటీసీ సభ్యురాలు తులిమెల్లి కృష్ణకుమారితో కలిసి శనివారం ఆమె ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలను విస్మరించిందని విమర్శించారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ శ్మశాన వాటిలో నీటి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డామని, నూతన బోరుతో నీటి సమస్య తీరినట్లేనని గ్రామ పెద్దలు సీహెచ్ .సత్యనారాయణ, టి.ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవినేని శ్రీధర్, తులిమెల్లి రంగారావు, తోట శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో త్రివిధ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన త్రివిధ విద్యార్థులు

నూజివీడు టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో నూజివీడు త్రివిధ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జనవరిలో ఇండియన్ మ్యాథ్స్ ఒలంపియాడ్ నిర్వహించగా తమ పాఠశాలకు చెందిన నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో పథకాలను సాధించారన్నారు. నాలుగో తరగతికి చెందిన ఈశ్వర్, కృష్ణ సాయి, మహేష్‌లతో పాటు ఐదో తరగతికి చెందిన రోహిత్, విహల్, విఘ్నే ష్, తనుష్‌లతో పాటు మరో 17 మంది జిల్లా స్థాయిలో మెడల్స్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చీపురుగూడెం గ్రామంలో 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. శనివారం గ్రామంలోని సారా స్థావరంపై దాడి చేసి నేర స్థలం నుంచి పారిపోయిన చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంకు చెందిన భూక్యా మహేంద్రపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. దాడిలో ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు రాంబాబు

పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

▸▸ గోగులంపాడు పాల సొసైటీ అధ్యక్షుడు రాంబాబు

ముసునూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు కృషి చేస్తున్నారని గోగులంపాడు పాల సొసైటీ అధ్యక్షుడు తొర్లపాటి రాంబాబు అన్నారు. శనివారం జరిగిన సొసైటీ పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మూడో విడత బోనస్‌గా రూ.18 కోట్లు విడుదల చేసిన చైర్మన్ చలసానికి ధన్యవాదాలు తెలిపారు. పాల ధరను రూ.52 నుంచి రూ.82కు పెంచడం, బోనస్‌తో కలిపి లీటరు పాల ధర రూ.92 వచ్చేలా రైతులకు గిట్టుబాటు ధరను కల్పించి, పాడిరైతులను ఆర్థికంగా చైర్మన్ బలోపేతం చేస్తున్నారన్నారు. చైర్మన్ పనితీరుపై పాలకవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో రైతులు తదితరలు పాల్గొన్నారు.